


వైసీపీ పాలనలో నవరత్నాల పేరుతో
ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని అప్పుల
ఊబిలోకి నెట్టారు. చంద్రబాబు
నాయకత్వంలో కూటమి ప్రభుత్వం
అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ
సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోంది.
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని
అభివృద్ధి పథంలో నడిపిస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 28.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 158 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోము



- సర్జికల్ స్ట్రైక్స్‌కు పదేళ్లు
- ఎల్‌వోసీ దాటి ఉగ్రస్థావరాలపై దాడి
- ప్రపంచానికి భారత్ విధానం స్పష్టం
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉగ్రవాదంపై భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఉగ్రవాద చర్యలను ఉపేక్షించబోమని, భారత్‌ను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులకు దీటైన సమాధానం ఉంటుందని అన్నారు. ఆదివారం నిర్వహించిన 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన 2016లో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ వైమానిక దాడులు, 'ఆపరేషన్ సిందూర్'లను ప్రస్తావించారు.

**సర్జికల్ స్ట్రైక్స్‌కు పదేళ్లు :** 2016 సెప్టెంబరు 28-29న భారత సైన్యం నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) దాటి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిన విషయాన్ని మోదీ గుర్తుచేశారు. ఈ ఆపరేషన్‌కు మరో 24 గంటల్లో పదేళ్లు పూర్తవుతున్నాయని చెప్పారు. ఉగ్రవాదంపై చర్య తీసుకునేందుకు భారత సైనికులు ఎల్‌వోసీ దాటి వెళ్లిన తీరు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా ఉగ్రవాదంపై భారత్ తన విధానాన్ని ప్రపంచానికి స్పష్టంగా చాటిచెప్పిందని పేర్కొన్నారు.

**బాలాకోట్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు :** గత దశాబ్ద కాలంలో భారత్ ఉగ్రవాదంపై తన వైఖరిని పదేపదే స్పష్టం చేసిందని ప్రధాని అన్నారు. బాలాకోట్ వైమానిక దాడి నుంచి 'ఆపరేషన్ సిందూర్' వరకు భారత్ ఒకే సందేశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రవాదులు దాడికి పాల్పడితే వారికి తగిన సమాధానం ఎదురవుతుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో దేశ సాయుధ బలగాల ధైర్యసాహసాలను మోదీ ప్రశంసించారు. దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు.

**గతంలో వరుస ఉగ్రదాడులు :** దేశంలో గతంలో వరుస బాంబు పేలుళ్లు, ఉగ్రదాడులు చోటుచేసుకున్న పరిస్థితులను కూడా ప్రజాోధాని గుర్తుచేశారు. 2008 సెప్టెంబరు 13న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లను, ఆ తర్వాత జరిగిన 26/11 ముంబయి ఉగ్రదాడిని ప్రస్తావించారు. గతంలో ప్రతి ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వచ్చేవని, అయితే ఆ సమయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోకుండా కాలం గడిచిపోయేదని మోదీ అన్నారు. ప్రస్తుతం భారత్ ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**జనగణనలో భాగస్వాములు కావాలి :** మన్ కీ బాత్‌లో జనగణన అంశాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ కొనసాగుతోందని, తొలి దశలోనే 32 కోట్లకు పైగా కుటుంబాల వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. మంచుతో కప్పబడిన మారుమూల ప్రాంతాల్లోనూ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. భవిష్యత్తు ప్రణాళికలకు ఖచ్చితమైన సమాచారం అవసరమని, ప్రజలు ఆన్‌లైన్‌లో స్వయంగా వివరాలు నమోదు చేసుకుని జనగణనలో

● మిగతా 2 లో

# ప్రతి అర్జీకీ జవాబుదారీతనం

- ఎవరి వద్ద ఉందో.. ఏం చేశారో ఆన్‌లైన్‌లో నమోదు
- ప్రతి దశకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు
- చర్యలకు ఆధారాలు జతచేయాల్సిందే
- పరిష్కారం అయ్యే వరకు కొనసాగనున్న పర్యవేక్షణ
- ఏఐ ఆధారిత ఎంఎంఏట్రిక్స్ పోర్టల్ రూపకల్పనకు మంత్రి సత్యకుమార్ చర్యలు
- ఈ తరహా వ్యవస్థ ప్రభుత్వ శాఖల్లో ఇదే తొలిసారి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కాగిత రహిత పాలనలో భాగంగా మంత్రివర్యుల కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారం అయ్యే వరకు దాని పురోగతిని పర్యవేక్షించే ఎంఎంఏట్రిక్స్ ఏఐ ఆధారిత పోర్టలును త్వరలో వైద్యారోగ్య శాఖలో అందుబాటులోకి తీసుకురానున్నారు. అర్జీ ఎక్కడ ఉంది, ఎవరి వద్ద ఉంది, ఏ చర్య తీసుకున్నారు, ఇంకా ఏం చేయాలి, ఎప్పటిలోగా పరిష్కరించాలి అనే వివరాలు ఇందులో నమోదవుతాయి. సాధారణంగా 10 పనిదినాల్లో ప్రక్రియను పూర్తి చేసేలా గడువు నిర్దేశించనున్నారు. వివిధ వర్గాల నుంచి వచ్చే వినతులపై మంత్రి జారీ చేసిన ఆదేశాల అమలు ఏ దశలో ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ దీనికి రూపకల్పన చేసింది. ప్రస్తుతం వినతుల స్వీకరణ, వాటిపై తీసుకున్న చర్యలు, మిగతా 2లో...

# హెచ్-1బీ వీసాలో భారీ మార్పులు..




**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** అమెరికాలో అత్యంత కీలకమైన హెచ్-1బీ వీసా విధానం రాబోయే ఏడాది కాలంలో గణనీయంగా మారనుంది. విదేశీ కార్మిక వీసాల విషయంలో జరుగుతున్న మోసాలపై ట్రంప్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండటంతో మిగతా 2లో...

# గేమ్‌క్రాఫ్ట్‌కు ఈడీ షాక్

- మరో రూ.442 కోట్ల ఆస్తుల జప్తు
- ఇప్పటివరకు రూ.2,800 కోట్లకుపైగా అటాచ్
- ఎఫ్‌డీలు, భవనాలు, విల్లాలు, స్థిర, చరాస్తులు జాబితాలో
- మనీలాండరింగ్ కేసులో చర్యలు

2 లో

# సచివాలయ ఉద్యోగుల 'చలో విజయవాడ' ఉద్రిక్తం

- ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్ల కోసం ఆందోళన
- అడ్డుకున్న పోలీసులతో తోపులాట.. పలువురు అదుపులోకి
- అర్హులకు నెల రోజుల్లో ప్రమోషన్లు: మంత్రి డోలా

2 లో



# సచివాలయ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేదు

- రెగ్యులరైజేషన్, సౌకర్యాలకు కట్టుబాటు
- అర్హులకు నెలలోనే ప్రమోషన్లు
- నోషనల్ ఇంక్రిమెంట్లపై ఫాలోఅప్
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

2 లో



# రైలు పట్టాలపైకి.. ఎల్ఎన్‌జీ శకం

- దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలుకు సబర్మతిలో శ్రీకారం
- డీజిల్ వినియోగంలో 40 శాతం వరకు ఎల్ఎన్‌జీ భర్తీ
- ఇంధన వ్యయం, ఉద్గారాల తగ్గింపే లక్ష్యం
- రైల్వే విద్యుదీకరణ 99.6 శాతం పూర్తి: అమిత్ షా




**గుజరాత్ (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోనే తొలి ఎల్ఎన్‌జి రైలును కేంద్ర మంత్రి అమిత్ షా ఆదివారం గుజరాత్ లోని సబర్మతి రైల్వే స్టేషన్ లో ప్రారంభించారు. ఈ కొత్త రైలు ఎల్ఎన్‌జి (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్), డీజిల్ రెండింటి పై నడుస్తుంది. డీజిల్ వినియోగంలో సుమారు 40 శాతాన్ని ఎల్ఎన్‌జి తో భర్తీ చేస్తుంది. డీజిల్ వినియోగం, ఇంధన ఖర్చులు, ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా దీన్ని ప్రవేశపెట్టారు. పచ్చజెండాను ఊపి ఎల్ఎన్జి రైలును ప్రారంభించిన అనంతరం మంత్రి అమిత్ షా సభలో ప్రసంగించారు. దేశరైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోడి సమూలంగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ తన పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. మరోవైపు.. గత 12 ఏళ్లలో మోడి పై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని అన్నారు. అర్థరహితంగా మాట్లాడే హస్తం పార్టీని.. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మిగతా 2లో...

# సచివాలయ ఉద్యోగులకు.. పదోన్నతుల బాట

- 815 కొత్త జూనియర్ అసిస్టెంట్ పోస్టుల సృష్టి
- అదనపు ఆర్థిక భారం లేకుండానే పోస్టుల పునర్వ్యవస్థీకరణ

2 లో

**అమరావతి, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది.

# ఆర్టీఐ నుంచి 'లా అండ్ ఆర్డర్'కు మినహాయింపు

- గూఢచార, భద్రతా సంస్థగా వర్గీకరిస్తూ గెజిట్ నోటిఫికేషన్
- సెక్షన్ 24(4) కింద తమిళనాడు ప్రభుత్వ నిర్ణయం
- పోలీసు కాల్పులు, కస్టడీ మరణాల వివరాలపైనా ప్రభావం
- రాజకీయ, కుల, మత ఘర్షణలకు సంబంధించిన సమాచారంపైనా ఆంక్షలు

2 లో



# వన్డేల్లో కోహ్లీ సరికొత్త చరిత్ర

- సచిన్ రికార్డు బద్దలు
- వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తి
- సచిన్ రికార్డును అధిగమించిన విరాట్
- 303 ఇన్నింగ్స్‌ల్లోనే ఘనత
- ఖాతాలో ఇప్పటికే 54 సెంచరీలు

**తిరువనంతపురం, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్): :** టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో మరో అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో అత్యంత వేగంగా లిలి15 వేల పరుగులులిలి పూర్తి చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి వన్డేలో కోహ్లీ ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. కోహ్లీ కేవలం 303 ఇన్నింగ్స్‌ల్లోనే 15 వేల పరుగుల మార్కును చేరుకున్నాడు. సచిన్ ఈ ఘనత సాధించడానికి 377 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 8 వేల నుంచి 14 వేల పరుగుల వరకు చేరుకున్న రికార్డులూ కోహ్లీ పేరిటే ఉన్నాయి. మిగతా 2లో...



# ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోము

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జనగణనను ఆయన జాతీయ బాధ్యతగా అభివర్ణించారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం :** పర్యావరణ పరిరక్షణపై దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాలను కూడా మోదీ ప్రస్తావించారు. అసోంలో అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న పిగ్మీ హాగ్ సంరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు. సుందర్బన్స్లో మహిళలు మడ అడవులను పెంచుతూ పర్యావరణాన్ని కాపాడటంతో పాటు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు.

**మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంపై ప్రశంస :** 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత మాదకద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తున్నారని ప్రధాని చెప్పారు. వ్యసనంతో బాధపడుతున్న వారిని దూరం చేయకుండా వారికి అండగా నిలిచి బయటపడేలా సహకరించాలని సూచించారు. యువత ఆరోగ్యకరమైన, సానుకూల మార్గంలో ముందుకు సాగేందుకు సమాజం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.

**భారతీయ సంస్కృతి, వారసత్వంపై ప్రస్తావన :** గుజరాత్లోని మొధేరా సూర్య దేవాలయాన్ని ప్రస్తావించిన మోదీ.. సూర్యారాధన భారతీయ సంప్రదాయంలో కేవలం ఆలయాలు, నిర్మాణాలకే పరిమితం కాదన్నారు. కాంతి, శక్తి, విజ్ఞానం, నిరంతర ప్రగతికి అది ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. మొధేరా దేశంలో తొలి సౌర గ్రామంగా గుర్తింపు పొందిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.

థాయ్లాండ్లో గణేశుడి ఆరాధనకు పెరుగుతున్న ఆదరణను కూడా మోదీ వివరించారు. అక్కడ గణనాథుడిని 'ఫ్రా ఫికానెట్'గా పూజిస్తారని, చియాంగ్మైలో వినాయక విగ్రహాలకు ప్రత్యేక మ్యూజియం ఉన్న విషయాన్ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లోని పురాతన బావులు, కోనేరులకు పునర్వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలను కూడా ప్రస్తావించారు.

**9/11 మృతులకు నివాళి :** అమెరికాలో జరిగిన 9/11 ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. ఆ దాడిలో అమెరికన్ల తర్వాత అత్యధిక సంఖ్యలో భారతీయులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ఉగ్రవాదంపై భారత్ తన విధానాన్ని మరింత స్పష్టంగా చాటిచెప్పుతోందని, దేశ భద్రత విషయంలో రాజీ ఉండదనే సందేశాన్ని మన్ కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# రైలు పట్టాలపైకి.. ఎల్ఎన్జీ శకం

(మొదటి పేజీ తరువాయి)

2014 లో మోడి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. రైల్వే వ్యవస్థలో అనేక కొత్త సదుపాయాలను కల్పించి, దానిని ఆధునికీకరించారని తెలిపారు. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారన్నారు. హైడ్రోజన్తో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా.. ప్రపంచంలో ఆ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన భారత్ను నిలిపారన్నారు. ముంబయి నుంచి వడోదర వరకు మొట్టమొదటి లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయిందన్నారు. 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్ను నాలుగు ట్రాక్ల నెట్వర్క్గా మార్చుతున్నామని అమిత్ షా తెలిపారు. 2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్ను వినియోగించాయన్నారు. 2024-25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు తగ్గిందని తెలిపారు. 2030 నాటికి సున్నాకి తగ్గిస్తామన్నారు. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందన్నారు. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగగా.. 2023-24 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగిందని వెల్లడించారు. 99.6 శాతం రైల్వే నెట్వర్క్ విద్యుదీకరణ పూర్తయ్యిందని అమిత్ షా తెలిపారు.

# హెచ్-1బీ వీసాలో భారీ మార్పులు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ మార్పులు అనివార్యమని తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా కార్మిక శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో స్వయంగా వెల్లడించారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. రాబోయే 365 రోజుల్లో విదేశీ కార్మిక వీసా కార్యక్రమంలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయని స్పష్టం చేశారు. మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయని తెలిపారు.

"అరెస్టులకు మేం సిద్ధంగా ఉన్నాం. వాస్తవాలను అమెరికా ప్రజల ముందు ఉంచుతున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు హెచ్-1బీ వీసా మోసాలపై ప్రభుత్వం ఎంత సీరియస్గా ఉందో తెలియజేస్తున్నాయి.

ఇప్పటికే కార్మిక శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ కార్యాలయం ఈ విచారణలో భాగంగా డజన్ల కొద్దీ సబ్పోనాలు జారీ చేయడంతో పాటు, పలు సంస్థల్లో సెర్చ్ వారెంట్లు కూడా అమలు చేసింది. ముఖ్యంగా క్రిమినల్ ఇన్వెస్టిగేషన్లో భాగంగా కాగ్నిజెంట్, క్లౌడెరా వంటి కొన్ని కంపెనీలకు సంబంధించిన వీసా దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేశారు.

నకిలీ దరఖాస్తులు, వేతనాల్లో అవకతవకలు, కార్మికుల దోపిడీ, అమెరికన్ ఉద్యోగులను తొలగించడం వంటి అంశాలపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలు ప్రభుత్వ విస్తృత వ్యూహంలో భాగమని స్పష్టమవుతోంది.

ఇప్పటికే కొంతమంది హెచ్-1బీ వర్కర్ల ప్రవేశంపై ఆంక్షలను పొడిగించిన ప్రభుత్వం, వీసా దరఖాస్తులను సమీక్షించేటప్పుడు కంపెనీలు గతంలో ఉద్యోగులను తొలగించిన చరిత్రను (లేఆఫ్స్) కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏజెన్సీలను ఆదేశించింది.

స్థానిక టెక్ ఉద్యోగాలను విదేశీ నిపుణులతో భర్తీ చేయకుండా నిరోధించేందుకు గతంలో 'ప్రాజెక్ట్ ఫైర్వాల్' వంటి కార్యక్రమాలను కూడా చేపట్టారు.

కొన్ని కంపెనీలు, ఔట్సోర్సింగ్ సంస్థలు అమెరికన్ల వేతనాలను, ఉద్యోగాలను దెబ్బతీసేందుకు హెచ్-1బీ విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శకులు ఆరోపిస్తుండగా, దేశంలో నిపుణుల కొరతను తీర్చడానికి ఈ వీసా ఎంతో అవసరమని దాని మద్దతుదారులు వాదిస్తున్నారు.

ఏదేమైనా ప్రస్తుత దర్యాప్తులు, ప్రభుత్వ సంకేతాలను బట్టి చూస్తే, సమీప భవిష్యత్తులో హెచ్-1బీ విధానంలో కఠినమైన నిబంధనలు, నిర్మాణాత్మక సంస్కరణలు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# సచివాలయ ఉద్యోగులకు.. పదోన్నతుల బాట

(మొదటి పేజీ తరువాయి)

వార్డు సచివాలయ సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ చానల్ను సుగమం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మిగులు పోస్టుల సర్దుబాటు ద్వారా పురపాలక పరిపాలన శాఖలో కొత్తగా 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అర్హత కలిగిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు ఈ పోస్టుల్లోకి పదోన్నతులు కల్పించింది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల పదోన్నతుల అనంతరం అర్హులైన వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియను చేపట్టింది.

అలాగే 815 వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను గ్రేడ్-1గా, మరో 815 వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను గ్రేడ్-1గా అప్గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టుల పునర్వ్యవస్థీకరణ, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా పూర్తి చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ప్రతి అర్జీకీ జవాబుదారీతనం

(మొదటి పేజీ తరువాయి)



పరిష్కార స్థితికి సంబంధించిన సమాచారం సంతృప్తికరంగా అందుబాటులో లేకపోవడంతో.. విస్తృత ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త విధానానికి మంత్రి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ శాఖల్లో ఇదే తొలిసారి. ఈ విధానంలో వివిధ వర్గాల వారు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే వినతులపై శాఖపరమైన తీసుకునే చర్యలను నిశితంగా పోర్టల్ ద్వారా మంత్రి, కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఇతర హెచ్ ఓ డి లు ఎప్పటికప్పుడు అని స్థాయిల్లో తెలుసుకునేలా లాగిన్ సౌకర్యం కల్పించనున్నారు అలర్ట్ మెసేజ్లు కూడా ఇందులో ఉంటాయి. ఈ పోర్టల్ ద్వారా భవిష్యత్తులో మరికొన్ని మరికొన్నిసదుపాయాలను అందుబాటులోనికి రానున్నాయి.

**ఎంఎంఎస్ట్రాక్స్ అంటే.. :** ఎంఎంఎస్ట్రాక్స్ (మినిస్టర్స్ మానిటరింగ్ & యక్షన్ టెలింగ్ ఆఫ్ రిప్రజెంటేషన్స్ & ఇంటర్ డిపార్ట్మెంట్ ఎస్కిక్యూషన్ ) అంటే మంత్రిత్వస్థాయి పర్యవేక్షణలో వినతులపై తీసుకునే చర్యలను నమోదు చేసి, వాటి పురోగతిని పర్యవేక్షించే విధానం. ఇది ఈ-ఆఫీస్కు ప్రత్యామ్నాయం కాదు. ఈ-ఆఫీస్ అధికారిక ఫైల్ ప్రక్రియగా కొనసాగుతుంది. ఆ ఫైల్ పై చర్యల పురోగతిని ఎంఎంఎస్ట్రాక్స్ లో పర్యవేక్షిస్తారు.

**మూడు సంఖ్యలు.. ప్రతి దశకు కీలకం :** ప్రతి అర్జీకి ఎంఎంఎస్ట్రాక్స్ గుర్తింపు సంఖ్య, ఈ-ఆఫీస్ స్వీకరణ సంఖ్య, ఈ-ఆఫీస్ ఫైల్ సంఖ్య ఉంటాయి. వీటి ఆధారంగా అర్జీని వివిధ దశల్లో గుర్తించి పర్యవేక్షిస్తారు. అవసరమైన సంఖ్య నమోదు కాకుండా తదుపరి దశకు వెళ్లకుండా వ్యవస్థలో నియంత్రణ ఉంటుంది.

**అర్జీ వచ్చిన రోజే నమోదు :** అర్జీ అందిన రోజే దాన్ని నమోదు చేస్తారు. అందిన తేదీ, ఎవరి ద్వారా వచ్చింది, మంత్రి చేసిన వ్యాఖ్యలు, అర్జీ రకం, ప్రాధాన్యత తదితర వివరాలతో పాటు అర్జీదారు లేదా ప్రజాప్రతినిధి, ఉద్యోగి తదితర వర్గాల్లో ఎవరి ద్వారా వినతి వచ్చిందో నమోదు చేస్తారు.

**గడువు ఖరారు :** కార్యదర్శి అర్జీని పరిశీలించి సంబంధిత శాఖకు పంపుతారు. తీసుకోవాల్సిన చర్యను స్పష్టంగా పేర్కొని, ప్రాధాన్యతను బట్టి గడువు నిర్ణయిస్తారు. సాధారణంగా 10 పనిదినాల గడువును వ్యవస్థ సూచిస్తుంది. వెంటనే పంపలేని అర్జీలకు కారణాన్ని నమోదు చేసి కార్యదర్శి వద్ద ఉంచే అవకాశం ఉంటుంది.

**శాఖకు చేరిన వెంటనే స్వీకరణ :** సంబంధిత శాఖ అర్జీని స్వీకరించినట్లు నమోదు చేస్తుంది. దరఖాస్తుదారుకు స్వీకరణ పత్రం జారీ చేస్తుంది. పత్రం తయారీ, ఆమోదం, పంపిన వివరాలు కూడా వ్యవస్థలో నమోదవుతాయి.

**బాధ్యత అప్పగింత.. చర్యలకు ఆధారాలు :** శాఖాధిపతి అర్జీని సంబంధిత అధికారికి అప్పగిస్తారు. అధికారి అవసరమైన చర్యలు తీసుకుని చర్య నివేదిక సమర్పించాలి. తీసుకున్న చర్యలు, జారీ చేసిన ఉత్తర్వులు, సంబంధిత పత్రాలు, ప్రస్తుత పరిస్థితితోపాటు ఆధారాలను జత చేయాలి.

**లోపాలుంటే తిరిగి.. సరిచేసి మళ్లీ నివేదిక :** నివేదికలో సమాచారం లోపిస్తే శాఖాధిపతి దాన్ని తిరిగి పంపుతారు. లోపాలను సరిచేసి అధికారి మళ్లీ నివేదిక సమర్పించాలి. గత నివేదికలు, వ్యాఖ్యలు కూడా రికార్డులో ఉంటాయి.

**పరిశీలించిన తర్వాతే పరిష్కారం :** నివేదిక సమర్పించినంత మాత్రాన అర్జీ పరిష్కారమైనట్లు కాదు. సంబంధిత ఉన్నతాధికారి నివేదిక, ఆధారాలను పరిశీలించి సమస్య పరిష్కారమైనట్లు నిర్ధారించిన తర్వాతే లిలిపరిష్కరించినదిలిలిగా నమోదు చేస్తారు. లోపాలుంటే మళ్లీ చర్య కోసం పంపిస్తారు.

**పరిష్కార వివరాలు దరఖాస్తుదారుకు :** కేసును పరిశీలించిన తర్వాత కార్యదర్శి ముగింపు కారణాన్ని నమోదు చేసి మూసివేస్తారు. సంబంధిత శాఖ తీసుకున్న చర్యలు, పరిష్కార విధానాన్ని దరఖాస్తుదారుకు తెలియజేస్తుంది. ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతులపై తీసుకున్న చర్యల వివరాలను కూడా వారికి తెలియజేస్తారు.

**మంత్రి సమీక్ష ఆదేశాల అమలు పై కూడా పర్యవేక్షణ :** మంత్రి సమీక్షసమావేశాల్లో ఇచ్చే ఆదేశాలను కూడా సమీక్ష చర్యల నమోదు విభాగంలో నమోదు చేస్తారు. బాధ్యత వహించే అధికారి, గడువు, తీసుకున్న చర్యలను నమోదు చేసి, గడువు దాటిన అంశాలను ప్రత్యేకంగా గుర్తిస్తారు. తదుపరి సమీక్షలో వాటి పురోగతిని పరిశీలించవచ్చు.

**డ్యాష్బోర్డులో.. మొత్తం పరిస్థితి :** డ్యాష్బోర్డు ద్వారా పెండింగ్లో ఉన్న అర్జీలు, వివిధ శాఖల్లో ప్రక్రియలో ఉన్నవి, మంత్రివర్యుల స్థాయిలో పరిశీలించాల్సిన అంశాలను ఒకేచోట చూడవచ్చు. ఎంఎంఎస్ట్రాక్స్ గుర్తింపు సంఖ్య, వినతిపత్రం సంఖ్య, ఈ-ఆఫీస్ స్వీకరణ సంఖ్య, దస్త్రం సంఖ్య, అంశం, దరఖాస్తుదారు, జిల్లా, నియోజకవర్గం వంటి వివరాలతో అర్జీని వెతకవచ్చు. ఎవరు, ఎప్పుడు ఏ చర్య తీసుకున్నారన్న వివరాలతో దాని పూర్తి చరిత్రను చూడవచ్చు.

**ప్రజలకు ప్రయోజనం :** అర్జీ ఇచ్చిన తర్వాత దాని పరిస్థితి తెలుసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుంది. అర్జీ ఎవరి వద్ద ఉందో, ఏ చర్య తీసుకున్నారో, గడువు ఎంత ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. తీసుకున్న చర్యలకు ఆధారాలు ఉండటంతో ప్రక్రియలో స్పష్టత పెరుగుతుంది. అర్జీ పరిష్కారమైన తర్వాత తీసుకున్న చర్యల వివరాలు దరఖాస్తుదారుకు చేరుతాయి.

కాగిత రహిత విధానంలో జవాబుదారీతనం, పారదర్శకత పెంచడమే ఎంఎంఎస్ట్రాక్స్ ప్రధాన ఉద్దేశం.

# సచివాలయ ఉద్యోగుల 'చలో విజయవాడ' ఉద్రిక్తం

**విజయవాడ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్):** స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఆదివారం చేపట్టిన 'చలో విజయవాడ' ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ధర్నాచౌక్ వద్దకు చేరుకున్న ఉద్యోగులను పోలీసులు అడ్డుకోవడంతో అలంకార్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించడంతో ఉద్యోగులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పలువురు ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించారు.




ఉద్యోగులు తమకు పదోన్నతులు కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ప్రొబేషన్ ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లుగా సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పటికీ పదోన్నతులతో పాటు పలు సర్వీస్ ప్రయోజనాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, మెరుగైన ప్రమోషన్ చానల్ తదితర అంశాలను ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి.

ఇదిలా ఉండగా, సచివాలయ ఉద్యోగుల ఆందోళనపై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పందించారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నోషనల్ ఇంక్రిమెంట్ల ఫైల్ను ఆర్థికశాఖకు పంపామని, దీనిపై ఫాలోఅప్ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సుమారు 14 వేల మందికి పదోన్నతులు కల్పించామని, మిగిలిన అర్హులకు కూడా నెల రోజుల్లో పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. త్వరలో కొత్త పీఆర్సీ కమిషన్ను ఏర్పాటు చేస్తామని, ఉద్యోగులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

కాగా, ఇదే సమయంలో ప్రభుత్వం వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్ చానల్ను సుగమం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగులు పోస్టుల సర్దుబాటు ద్వారా 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు, 815 వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను, 815 వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను గ్రేడ్-1గా అప్గ్రేడ్ చేసినట్లు ప్రభుత్వ ఉత్తర్వులు ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి. ఈ పునర్వ్యవస్థీకరణకు అదనపు ఆర్థిక భారం ఉండదని పేర్కొన్నారు.

మరోవైపు, 'చలో విజయవాడ' కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేదని, భారీ వర్షాలు, తుపాను పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగులు విధులకు అందుబాటులో ఉండాలని అధికారులు సూచించిన విషయం కూడా వెలువడింది.

# సచివాలయ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేదు

**విశాఖపట్నం, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్):** స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సౌకర్యాల కల్పన విషయంలో కూటమి ప్రభుత్వం రాజీపడదని రాష్ట్ర స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.



గత ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదని, తమ ప్రభుత్వం రెగ్యులరైజేషన్ ప్రక్రియను అమలు చేసిందని మంత్రి తెలిపారు. నోషనల్ ఇంక్రిమెంట్లకు సంబంధించిన ఫైలును ఇప్పటికే ఆర్థికశాఖకు పంపినట్లు వెల్లడించారు. ఈ అంశంపై ఆర్థికశాఖతో నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నామని చెప్పారు. సిబ్బంది కొరత ఉన్న చోట ఒకరికొకరు సేవలు అందించేలా విధానాన్ని డీసెంట్రలైజ్ చేశామని, ఉద్యోగులకు ఆటోమేటిక్ లీవ్ శాంక్షన్ విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఉన్నతాధికారి స్పందించకపోయినా రెండు రోజుల క్యాజువల్ లీవ్ మంజూరయ్యే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ చానల్ కల్పించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. సెప్టెంబరు 27న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అర్హత కలిగిన వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు కొత్త పోస్టులు, ప్రమోషన్ మార్గాలను ఏర్పాటు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. 18 కేడర్లకు ప్రమోషన్ చానళ్లను తీసుకువచ్చినట్లు, ఇప్పటివరకు 14,331 మందికి పదోన్నతులు కల్పించినట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి.

మిగిలిన అర్హులైన ఉద్యోగులకు కూడా నెల రోజుల్లో ప్రమోషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కావాలన్న ఉద్యోగుల డిమాండ్పై స్పందిస్తూ త్వరలో కొత్త పీఆర్సీ కమిషన్ను ఏర్పాటు చేస్తామని, ఉద్యోగులు తమ ప్రతిపాదనలు కమిషన్కు సమర్పించాలని సూచించారు. పీఆర్సీ కమిషన్ సిఫారసుల మేరకు ప్రభుత్వం తదుపరి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.

ఇప్పటికే ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన అర్హులైన స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ కింద ప్రత్యేక గ్రేడ్ పొందే స్కేల్ వర్తింపజేసేందుకు ప్రభుత్వం సెప్టెంబరు 20న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉందని, వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు సరికాదని మంత్రి అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉద్యోగులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వం ఉద్యోగుల అనుకూల విధానంతో ముందుకు సాగుతోందని, ఉద్యోగులంతా ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి కోరారు.

# ఆర్టీఐ నుంచి 'లా అండ్ ఆర్డర్'కు మినహాయింపు

**తమిళనాడు (జర్నలిస్ట్ ఫైల్):** తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 పరిధి నుంచి మినహాయించింది. ఈ శాఖను "ఇంటెలిజెన్స్ మరియు సెక్యూరిటీ ఆర్గనైజేషన్" (గూఢచార, భద్రతా సంస్థ)గా పరిగణిస్తూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



వివరాల్లోకి వెళితే, తమిళనాడు ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా +.నా. వీ.టీ.కే.57 పేరిట ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ మినహాయింపు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం, రాష్ట్రాలు తమ పరిధిలోని గూఢచార, భద్రతా సంస్థలను ఆర్టీఐ చట్టం నుంచి మినహాయించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఇదే నిబంధనను ఉపయోగించి, శాంతిభద్రతలను పర్యవేక్షించే ప్రధాన విభాగాన్ని ఈ జాబితాలో చేర్చారు.

ఈ నిర్ణయం వల్ల... ఇకపై రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసుల కాల్పులు, కస్టడీ మరణాలు, నిరసనలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా పొందే అవకాశం ప్రజలకు ఉండదు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ ప్రశ్నించడం లేదా సమాచారం కోరడం సాధ్యపడదు.

# గేమ్క్రాఫ్ట్కు ఈడీ షాక్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్):** ఆన్లైన్ గేమింగ్ మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న గేమ్క్రాఫ్ట్ సంస్థకు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద తాజాగా రూ.442 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. వీటిలో సంస్థకు చెందిన ఫిక్స్డ్ డిపాజిట్లు, వాణిజ్య భవనాలు, విల్లాలు, నివాస సముదాయాలతో పాటు గేమ్క్రాఫ్ట్ టెక్నాలజీస్ యజమానుల పేరిట ఉన్న స్థిర, చరాస్తులు ఉన్నాయి.

ఇప్పటికే రూ.2,400 కోట్లకుపైగా విలువైన ఆస్తులను జప్తు చేసిన ఈడీ.. తాజాగా చేసిన అటాచ్మెంట్తో గేమ్క్రాఫ్ట్కు సంబంధించిన జప్తు చేసిన ఆస్తుల విలువ రూ. 2,800 కోట్లకు పైగా చేరినట్లు తెలిపింది. ఆస్తుల అటాచ్మెంట్కు సంబంధించి ఆదివారం సంస్థకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

**మూడు కోట్ల మందికిపైగా వినియోగదారులు :** గేమ్క్రాఫ్ట్, రమ్మీ టైమ్ టెక్నాలజీస్ సంస్థలు 'రమ్మీ కల్చర్', 'రమ్మీ ప్రైమ్', 'ప్లేషిప్' తదితర మొబైల్ యాప్లను అభివృద్ధి చేసి ఆన్లైన్ రియల్ మనీ గేమ్స్ నిర్వహించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారం ద్వారా మనీలాండరింగ్కు పాల్పడినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంటోంది. ఆయా యాప్లను దేశవ్యాప్తంగా మూడు కోట్లకుపైగా మంది వినియోగిస్తున్నట్లు ఈడీ తెలిపింది.

ఈ యాప్ల ద్వారా డబ్బు కోల్పోయిన వినియోగదారుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకకు చెందినవారు ఉన్నట్లు ఈడీ వెల్లడించింది.

**బాట్లతో ఆటలు.. భారీగా నష్టం? :** గేమింగ్ యాప్లను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు వినియోగదారులను నమ్మించినట్లు గేమ్క్రాఫ్ట్పై ఈడీ ఆరోపణలు చేసింది. అయితే, వినియోగదారులకు తెలియకుండా ప్రత్యేక అల్గారిథమ్తో పనిచేసే బాట్లను ఆన్లైన్ గేమ్స్లో ఉపయోగించినట్లు పేర్కొంది. దీంతో గేమ్స్ ఆడిన పలువురు పెద్ద మొత్తంలో డబ్బు కోల్పోయినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపింది.

ఈ విధంగా నిర్వహించిన గేమ్స్ ద్వారా గేమ్క్రాఫ్ట్, రమ్మీటైమ్ టెక్నాలజీస్కు భారీగా ఆదాయం సమకూరినట్లు ఈడీ ఆరోపించింది.

# వన్డేల్లో కోహ్లీ సరికొత్త చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)



**పరుగుల పరంపర :** వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కోహ్లీ రెండో స్థానంలో ఉన్నాడు. సచిన్ టెండూల్కర్ 452 ఇన్నింగ్స్లో 18,426 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కోహ్లీ 15 వేల పరుగులతో రెండో స్థానంలో ఉండగా.. శ్రీలంక మాజీ ఆటగాడు కుమార సంగక్కర (14,234), ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ (13,704), శ్రీలంకకు చెందిన సనత్ జయసూర్య (13,430) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**54 శతకాలు :** వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్గానూ కోహ్లీ కొనసాగుతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో సచిన్ టెండూల్కర్ 49 సెంచరీల రికార్డును అధిగమించిన కోహ్లీ.. తన 50వ వన్డే శతకాన్ని నమోదు చేశాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో లిలి54 వన్డే సెంచరీలులిలి ఉన్నాయి. ఈ ఫార్మాట్లో మరే ఇతర బ్యాటర్ 35 శతకాల మార్కును కూడా అందుకోలేదు.

**9 వేల నుంచి 10 వేల పరుగులకు 11 ఇన్నింగ్స్లే :** రికార్డులు బద్దలు కొట్టడం కోహ్లీకి కొత్తేమీ కాదు. వన్డేల్లో 8,000, 9,000, 10,000, 11,000, 12,000, 13,000, 14,000 పరుగులను అత్యంత వేగంగా సాధించిన రికార్డులు అతడి పేరిటే ఉన్నాయి. ముఖ్యంగా 9 వేల నుంచి 10 వేల పరుగులకు చేరుకోవడానికి కేవలం 11 ఇన్నింగ్స్లే పట్టడం విశేషం.

**గిల్తో కీలక భాగస్వామ్యం :** వెస్టిండీస్తో తొలి వన్డేలో కోహ్లీ మరోసారి తన అనుభవాన్ని చాటుకున్నాడు. శుభ్మన్ గిల్తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత ఇన్నింగ్స్ను పటిష్ఠ స్థితిలో నిలిపాడు. కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని చేరుకోవడంతో అభిమానులు, క్రికెట్ వర్గాల్లో సందడి నెలకొంది.

**వచ్చే ప్రపంచకప్పై దృష్టి :** ప్రస్తుతం 37 ఏళ్ల వయసులో ఉన్న కోహ్లీ.. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ప్రపంచకప్పై దృష్టి సారించాడు. ఆ మెగా టోర్నీకి సిద్ధమవుతున్న క్రమంలో వన్డేల్లో తన రికార్డుల పరంపరను కొనసాగిస్తున్నాడు.

# జీఎస్టీలో ఏపీ 'ఏఐ' మోడల్ అదుర్స్!

- ఛత్తీస్‌గఢ్‌లోనూ యథాతథంగా అమలుకు ఆసక్తి
- పన్ను ఎగవేతల గుర్తింపు నుంచి కేసుల విచారణ వరకు ఏఐ సాయం
- శిక్షణ, సాంకేతిక సహకారం అందించాలని విజ్ఞప్తి




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జీఎస్టీ అమలును సమర్థవంతంగా నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అమలు చేస్తున్న కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఆధారిత ఎండ్ టు ఎండ్ ట్యాక్స్ సొల్యూషన్స్ విధానం దేశంలోని పలు రాష్ట్రాలను ఆకట్టుకుంటోంది. ఈ విధానాన్ని తమ రాష్ట్రాల్లోనూ అమలు చేయడానికి ఆయా రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇందులో భాగంగా పలు రాష్ట్రాలకు చెందిన పన్నుల శాఖ ప్రతినిధుల బృందం ఏపీ వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ విధానాన్ని అధ్యయనం చేయడానికి రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా తమ రాష్ట్రంలో ఏపీ మోడల్‌ను అమలు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేస్తోంది. దీనికోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పన్నుల శాఖకు చెందిన ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖను సందర్శించి ఆ శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ మోడల్‌ను అధ్యయనం చేసింది. ఛత్తీస్‌గఢ్ ఐఆర్ఎస్ ప్రత్యేక కమిషనర్ తరన్నుమ్ వర్మ నేతృత్వంలో జాయింట్ కమిషనర్ నరేంద్ర వర్మ, డిప్యూటీ కమిషనర్లు హేమంత్ సిన్హా, ప్రకాశ్ గుప్తే, అసిస్టెంట్ కమిషనర్ పూర్వ గుప్తీ, సిస్టమ్ అనలిస్ట్ రిధిమా శర్మ లతో కూడిన ప్రత్యేక బృందం మూడు రోజుల పాటు ఏపీలో అధ్యయనం చేసింది. ఈ బృందానికి రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమీషనర్ బాబు ఏ సాదర స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ ప్రత్యేకతల గురించి వారికి వివరించారు. మూడు రోజుల పాటు ఈ బృందం ఐటీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, లీగల్ ఏఐ, కేస్ మేనేజ్మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేతల నిరోధక వ్యవస్థ, ఆదాయ వృద్ధి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, సాంకేతికత ఆధారిత క్షేత్రస్థాయి కార్యకలాపాల వంటి అంశాలపై చర్చలు జరపడంతో పాటు వాటిని అధ్యయనం చేశారు.


తొలిరోజు ఐటీ, డీఏసీ విభాగంలో వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఐటీ, డేటా అనలిటిక్స్, ఏఐ కార్యక్రమాలపై ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందానికి అవగాహన కల్పించారు. లీగల్ విభాగంలో ఆధ్వర్యంలో కేస్ మేనేజ్మెంట్, లిటిగేషన్ ట్రాకింగ్ న్యాయపరమైన కేసుల నిర్వహణలో ఏఐ వినయోగంపై సోదాహరణంగా వివరించారు. రెండవ రోజు ఎన్‌ఫోర్స్‌మెంట్, పన్ను ఎగవేత నిరోధక చర్యలు, ఆదాయ ధోరణులు, ఆదాయ వృద్ధి వ్యూహాలు, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ) పనితీరుపై ప్రతినిధి బృందానికి వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలు, వాహనాల తనిఖీల కోసం రూపొందించిన మొబైల్ అప్లికేషన్లను, వాటి పనితీరు గురించి వివరించారు.

ఏపీ వాణజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ మాట్లాడుతూ జీఎస్టీ చట్టం అమలులో కృత్రిమ మేథ వినియోగిస్తున్న విధానంపై సమగ్రంగా ఛత్తీస్ గఢ్ ప్రతినిధి బృందానికి వివరించారు. చట్టబద్ధమైన పన్నుల నిర్వహణ ప్రక్రియలో ఏఐ, అధునాతన డేటా అనలిటిక్స్‌ను అనుసంధానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. డేటాను సమగ్రంగా విశ్లేషించడం ద్వారా అది క్షేత్రస్థాయిలో అధికారులకు సహకరించడమే కాకుండా నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి, పన్ను ఎగవేతలను నిరోధించడానికి కూడా ఏఐ ఎంతో ఉపయోగడపడుతుందని ఆయన వివరించారు. చట్టబద్ధమైన నిర్ణయాలను మాత్రం సంబంధిత అధికారులే తీసుకుంటారని స్పష్టం చేశారు.

**జీఎస్టీ విచారణలో ఎండ్ టు ఎండ్ ఏఐ ఆధారిత పరిష్కారం :** జీఎస్టీ కేసుల విచారణకు సంబంధించి ఏపీ వాణిజ్యపన్నుల శాఖ రూపొందించిన ఎండ్ టు ఎండ్ ఏఐ ఆధారిత పరిష్కారం ఛత్తీస్‌గడ్ బృందాన్ని ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ప్రమాదకరమైన, క్లిష్టతరమైన పన్ను చెల్లింపుదారులను గుర్తించడానికి రిస్క్ పొఫైలింగ్, కేసుల ఎంపిక, కేసుల కేటాయింపు, డేటాలో వ్యత్యాసాలు, అనుమానాస్పద లావాదేవీల నమూనాలను గుర్తించడం, విచారణ విశ్లేషణతోపాటు జీఎస్టీ చట్టం, నిర్దేశిత విధానాలకు అనుగుణంగా చట్టబద్ధమైన నోటీసులు, సమాచార పత్రాలు, ఉత్తర్వుల ముసాయిదాలను రూపకల్పన వరకు సమస్తం ఈ ఏఐ సహకారంతో నిర్వహిస్తున్నామని బాబు ఏ వివరించారు. ఏఐని కేవలం డేటా విశ్లేషన సాధనంగా కాకుండా, జీఎస్టీ పరిపాలనా ప్రక్రియ మొత్తంలో సమగ్ర నిర్ణయ సహాయక వ్యవస్థగా వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. పన్ను చెల్లింపుదారుల సమాచారం, రిస్క్ సూచికలు, గుర్తించిన వ్యత్యాసాలు, చట్టబద్ధమైన నిబంధనలను ఒకే వ్యవస్థలో అనుసంధానం చేయడం ద్వారా కేసుల ఎంపిక నుంచి దర్యాప్తు విశ్లేషణ, సంబంధిత దశల్లో అవసనరమైన చట్టబద్ధ పత్రాల ముసాయిదాల తయారీ వరకు అధికారులకు ఈ వ్యవస్థ సహాయపడుతుందని, తుది పరిశీలన, ఆమోదం మాత్రం సంబంధిత సమర్థ అధికారి ద్వారానే జరుగుతుందని వివరించారు.

**ఏపీ మోడల్ మేం కూడా అమలు చేస్తాం :** జీఎస్టీ నిర్వహణలో ఏఐని ఎండ్ టు ఎండ్ విధానంగా ఏపీ అమలు చేస్తున్న తీరును, రిస్క్ ఆధారిత కేసుల ఎంపిక, దర్యాప్తు, ముసాయిదాల తయారీ వంటి అంశలను ఒకే సమగ్ర విధానంలో అనుసంధానం చేసి అమలు చేస్తున్న తీరును ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. పన్నుల నిర్వహణలో ఏఐ వినియోగంవల్ల కలిగే ప్రస్తుత ప్రయోజనాలు, బవిష్యత్తు అవకాశాలపై రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు విస్తృతంగా చర్చించి అభిప్రాయలను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వాణిజ్యపన్నుల శాఖ అభివృద్ధి చేసిన ఏఐ ట్యాక్స్ సొల్యూషన్స్‌ను తమ రాష్ట్రంలో యథాతథంగా అమలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృంధం తెలిపింది. దీనికి కావాల్సిన శిక్షణ, సామర్థ్య నిర్మాణంలో ఏపీ సహాకారం కావాలని కోరింది.

# ఏపీ టెట్‌లో సంస్కృతి అకాడమీ విద్యార్థుల సత్తా



- హిందీ పేపర్-2ఏలో రాష్ట్రస్థాయిలో తొలి రెండు ర్యాంకులు
- 130 మార్కులతో జె. హేమాంజలి ప్రథమం.. 126 మార్కులతో కె. ఉజ్జ్వల రాణిబాయి ద్వితీయం

**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఇటీవల విడుదలైన ఏపీ టెట్-2026 ఫలితాల్లో ప్రొద్దుటూరులోని సంస్కృతి అకాడమీ ఆధ్వర్యంలో డీఎస్సీకి శిక్షణ పొందుతున్న అభ్యర్థులు విశేష ప్రతిభ కనబరిచారు. హిందీ సబ్జెక్టులో పేపర్-2ఏకు సంబంధించి జె. హేమాంజలి 150కి 130 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. అదే విభాగంలో కె. ఉజ్జ్వల రాణిబాయి 150కి 126 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు పొందారు. వీరితోపాటు సంస్కృతి అకాడమీలో శిక్షణ పొందుతున్న పలువురు అభ్యర్థులు 120కి పైగా మార్కులు సాధించారు.

**రాష్ట్రస్థాయి ర్యాంకులతో గుర్తింపు**

ఏపీ టెట్-2026లో హిందీ పేపర్-2ఏలో రాష్ట్రస్థాయిలో తొలి రెండు ర్యాంకులను సంస్కృతి అకాడమీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు సాధించడం విశేషం. జె. హేమాంజలి 130 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, కె. ఉజ్జ్వల రాణిబాయి 126 మార్కులతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. వీరితోపాటు మరో పలువురు అభ్యర్థులు 120కి పైగా మార్కులు సాధించడం అకాడమీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.

**విద్యార్థులకు ప్రోత్సాహం**

డీఎస్సీ, ఉపాధ్యాయ అర్హత పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను సంస్కృతి అకాడమీ నిరంతరం ప్రోత్సహిస్తోంది. పరీక్షలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వంతో అభ్యర్థులను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో ఏపీ టెట్-2026 ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించారు.

**మంత్రి సత్యకుమార్‌కు కృతజ్ఞతలు**

విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సంస్కృతి అకాడమీ స్ఫూర్తిప్రదాత, ప్రేరణదాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విద్యార్థులు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. తమ విజయానికి అకాడమీ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు.

**మార్గదర్శకులకు ధన్యవాదాలు**

అలాగే సంస్కృతి అకాడమీ మార్గదర్శకులు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయకర్త, గౌరవ అధ్యక్షులు శ్రీ ఒంటేరుశ్రీనివాసుల రెడ్డికి కూడా విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తమను నిరంతరం ప్రోత్సహిస్తూ, పరీక్షల సన్నద్ధతలో అవసరమైన మార్గదర్శకత్వం అందించిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు.

ఏపీ టెట్-2026లో సాధించిన ఈ ఫలితాలు మరింత మంది అభ్యర్థులకు స్ఫూర్తినిస్తాయని, భవిష్యత్తులో డీఎస్సీతోపాటు ఇతర ఉపాధ్యాయ నియామక పరీక్షల్లోనూ మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని విద్యార్థులు తెలిపారు.

# కార్మిక వర్గ దృక్పథమే జగన్ సిద్ధాంతం




- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి • కార్మిక పక్షపాతి జగన్
- వైసీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** శ్రమజీవుల సంక్షేమమే సంపద సృష్టికి మూలమని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వాస్తవం తెలిసిన జననేతగా వైయస్ జగన్ పూర్తి కార్మిక వర్గ దృక్పథంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన వెల్లడించారు. వైయస్సార్ ట్రేడ్ యూనియన్ నూతన నగర కమిటీ నేతలు ఆదివారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, వైసీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమాను మర్యాద పూర్వకంగా కలిశారు. వైయస్సార్ టియుసి జిల్లా అధ్యక్షుడు శేషగిరి పవన్, నగర అధ్యక్షుడు మురళి, పత్తిపాడు అధ్యక్షుడు తిరుపతి బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన నాయకులందరికీ వారు స్వయంగా శాలువాలు కప్పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరులోనే శ్రామికులున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో శ్రమను గుర్తించి గౌరవించడమే కాక కార్మికుల సంక్షేమానికి వైయస్ జగన్ కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అందుకే కార్మిక జీవితాల్లో కొత్త వెలుగులు నింపడానికి ఆయన తన హయాంలో పలు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు వారికి ఆర్థిక చేయూత కూడా అందించినట్లు చెప్పారు. మళ్ళీ ఆయన ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం శ్రామిక శ్రేయో రాజ్యంగా వర్ధిల్లుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికులంతా ఏకమై వైసీపీని తిరిగి అధికారంలోకి తేవడంలో కీలకమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వైసీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా మాట్లాడుతూ, ఆటో, టిప్పర్ డ్రైవర్లు, టైలర్లు తదితర అనేక రంగాల కార్మికులకు ప్రయోజనాలు కలిగించేలా ప్రత్యేక పథకాలు రూపొందించి ఆచరణలో అమలు చేసి చూపిన ఘనత వైయస్ జగన్ ఒక్కరికే దక్కుతుందని పేర్కొన్నారు. నగదు బదిలీ పథకం ద్వారా మధ్య దళారీ వ్యవస్థ ప్రమేయం లేకుండా నేరుగా కార్మికుల బ్యాంక్ ఖాతాలోకే నగదు జమ చేసి దేశంలోనే కార్మిక పక్షపాతం గల ముఖ్యమంత్రిగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పిల్లి మేరీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, వైయస్సార్ టియుసి రాష్ట్ర కార్యదర్శులు సింగు నరసింహారావు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రజిని, ఉపాధ్యక్షులు కొండలరావు, పోకల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు జోసెఫ్ తంబి, రామిరెడ్డి, ఫ్రాంక్లిన్ రాజు, బిలిపాటి వెంకటరమణ, కార్యదర్శులు ఏఆర్ గణేష్, బడుగు నారాయణ, చవల బ్రహ్మయ్య, చెవల దుర్గారావు, మోజెస్, అడపాల నారాయణ, పరమేష్, రవి, మస్తాన్, విజయ్, లక్ష్మయ్య, చెన్నయ్య, 31వ డివిజన్ అధ్యక్షుడు తోట వెంకట్, 31వ డివిజన్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నీసు రాజు, కోటి, వైయస్సార్ టియుసి జిల్లా కార్యదర్శి ఏసుబాబు, గుంటూరు మండల వైయస్ఆర్టియు అధ్యక్షుడు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# తొలిసారి రాజమహేంద్రవరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్):** తొలిసారిగా రాజమహేంద్రవరం వేదికగా సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వేడుకలు నిర్వహిస్తున్నామని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో కొత్త పర్యాటక కార్యాచరణకు 'రాజమండ్రి డిక్లరేషన్' ప్రకటించనున్నట్లు చెప్పారు. ఏఐ సాంకేతికతతో రాష్ట్రంలోని 130 పర్యాటక ప్రాంతాల సమాచారాన్ని 130 భాషల్లో అందుబాటులోకి తెస్తున్నామని, ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్ల ద్వారా ఏపీ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. 2027 గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు కర్టెన్ రైజర్‌గా 'ది గోదావరి కాల్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, టెంట్ సిటీలు, వాటర్‌ఫ్రంట్ గేమ్స్, ఎకో టూరిజం, క్రూజ్, కారవాన్ టూరిజం, హోమ్‌స్టేలు వంటి కొత్త కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు సుమారు రూ.428 కోట్ల నిధులు మంజూరయ్యాయని, తిరుపతి, విశాఖలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఏపీ తీరంలో కోవాళం తరహా వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పెట్టుబడిదారులు ఏపీ వైపు వస్తున్నారని దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరం సమీపంలోని పిచ్చుకలంకలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోందని, వివిధ ప్రాంతాల్లో స్టార్ హోటళ్లు, రిసార్టులు, ఫిల్మ్ స్టూడియోల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని చెప్పారు. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక, జ౯ నిబంధనల ప్రకారం త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని, ఆతిథ్య రంగానికి ఉపయోగపడేలా చర్యలు చేపడతామన్నారు. కళారంగానికి పూర్వవైభవం తీసుకురావడంలో భాగంగా డిసెంబర్‌లో విజయవాడ లేదా అమరావతిలో నంది ఫిల్మ్ అవార్డులు, తిరుపతిలో నంది టీవీ అవార్డులు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. జనవరిలో తెనాలిలో నంది నాటకోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ పోటీ చేస్తామని, ఉండ్రాజవరంలో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు ఆమోదయోగ్యమైన స్థలాన్ని గుర్తించామని తెలిపారు. రాజమహేంద్రవరంలో 138 మంది ఇండియన్ రిజర్వ్ దళ సిబ్బందికి ఆధునిక సాంకేతిక అంశాలు, మానవ విలువలపై శిక్షణ పూర్తయిందని మంత్రి చెప్పారు.

# విజయవాడలో ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం 2కే రన్

- ఆరోగ్యకరమైన జీవనశైలికి నిత్య వ్యాయామం, సమతుల ఆహారం కీలకం: కె. విజయానంద్



**విజయవాడ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్):** ఆరోగ్యమే మహాభాగ్యం.. నిత్య వ్యాయామమే ఆరోగ్యానికి పునాది అనే సందేశంతో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఆదివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఆరోగ్యం, ఫిట్‌నెస్, వెల్‌నెస్, ముందస్తు ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో బీఆర్‌టీఎస్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ వయసుల ప్రజలు, కుటుంబాలు, రోటరీ సభ్యులు, ఆరోగ్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ సెంటర్, రోటరీ విజయవాడ మిడ్‌టౌన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 2కే రన్‌ను రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కె. విజయానంద్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రమం తప్పని వ్యాయామం, సమతుల ఆహారం, క్రమబద్ధమైన దినచర్య, ముందస్తు ఆరోగ్య సంరక్షణ ఎంతో అవసరమన్నారు. నడక, పరుగు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆయుర్వేదంలోని సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన 2కే రన్‌లో పాల్గొన్న వారు 'ఆరోగ్యం కోసం పరుగు - ఆరోగ్యకరమైన జీవనం కోసం పరుగు' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. 'ఆరోగ్యకరమైన మనసులు - బలమైన శరీరాలు - ఉజ్వలమైన భవిష్యత్తు' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించింది. క్రమం తప్పని వ్యాయామంతో పాటు సమతుల పోషకాహారం, తగిన విశ్రాంతి, ముందస్తు ఆరోగ్య సంరక్షణను జీవనశైలిలో భాగం చేసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రోటరీ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు వెంకట్ కేటిబోయిన, కార్యదర్శి త్రినాథ్ నందూరి, శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ సెంటర్ ఎండీ డాక్టర్ సుబ్రమణ్యేశ్వరరావు, విశ్వ ఆయుర్వేద పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ కొండా వేంకటేశ్వర్లు, రోటరీ సభ్యులు, వాలంటీర్లు, నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముఖ్య అతిథులు, పాల్గొన్న ప్రజలు, వాలంటీర్లు, రోటరీ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం డైరెక్టర్‌గా తిప్పన పవన్ కుమార్ నాయుడు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం, కళ్యాణ మండపం నూతన కమిటీ డైరెక్టర్‌గా తిప్పన పవన్ కుమార్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు, కుల పెద్దలు ఆయనకు అభినందనలు తెలిపారు.

డైరెక్టర్‌గా తనను ఏకగ్రీవంగా ఎన్నుకుని బాధ్యతలు అప్పగించిన కుల పెద్దలకు తిప్పన పవన్ కుమార్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. అన్నదాన సత్రం, కళ్యాణ మండపం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అందరి సహకారంతో సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, కుల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# ఎల్పియులో విద్యార్థుల ఆందోళనలు



- జాతీయ రహదారి దిగ్బంధం
- అత్యాచారం వార్తలతో నిరసనలు

**చండీఘడ్ (జర్నలిస్ట్ ఫైల్) :** పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ (ఎల్పియు) విద్యార్థులు రోడ్డెక్కారు. యూనివర్శిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై అత్యాచారం చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో శనివారం రాత్రి ఒక్కసారిగా విద్యార్థులు ఆందోళనకు దిగారు. అంతేకాకుండా యూనివర్శిటీ ప్రాగంణం విధ్వంసం, హైవే దిగ్బంధనం వంటి సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. అయితే, ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. అలాగే బాధితులు లేదా నిందితులు ఎవరి వివరాలు కూడా తెలియరాలేదన్నారు. ఈ ఆరోపణలన్నీ కేవలం కల్పితాలని యూనివర్శిటీ అధికారులు పేర్కొంటుండగా, పోలీసులు మాత్రం దర్యాప్తును ప్రారంభించారు. విద్యార్థినిపై అత్యాచారం జరిగిందని వార్త వెలువడిన వెంటనే ఒక్కసారిగా విద్యార్థులు ఆగ్రహంతో వర్శిటీ క్యాంపస్‌లోని కిటికీ అద్దాలు పగలగొట్టారు, పూల కుండీలను విసిరేశారు. కొన్ని వస్తువులను తగలబెట్టడం కూడా కనిపించింది. ఇందుకు సంబంధించి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అలాగే జలంధర్-ఫగ్వారా జాతీయ రహదారిని కూడా విద్యార్థులు దిగ్బంధించారు. కాగా దీనిపై పోలీసు అధికారులు స్పందిస్తూ నిరసనల సమయాల్లో విద్యార్థులు కనీసం బాధితురాలి వివరాలు కూడా ఇవ్వలేదని చెప్పారు. కాగా ఎల్పియు యాజమాన్యం మాత్రం ఇదంతా సంఘ వ్యతిరేక శక్తుల పనే అని విమర్శించింది. వర్శిటీలోని శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే పనులేనని యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మోనికా గులాతి ఆదివారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు విద్యార్థులను ఒప్పించి ఉదయానికల్లా దిగ్బంధనం ఎత్తివేస్తూ చర్యలు తీసుకున్నారు. అయినా విద్యార్థులు మళ్ళీ హైవేను దిగ్బంధించడంతో పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ ల్లోని కొన్ని ప్రాంతాలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయి. కపుర్తలా ఎస్ఎస్‌పి గౌరవ్ తూరా మాట్లాడుతూ, విద్యార్థుల స్టేట్‌మెంట్ నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేపట్టామన్నారు.

# ఆందోళనకరంగా ప్రపంచ పరిస్థితులు : మంత్రి జై శంకర్



**న్యూఢిల్లీ :** ప్రపంచ పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఆర్థిక వ్యవస్థ, మార్కెట్ ప్రవేశం, సరఫరా గొలుసులు, సాంకేతికత వంటివి ఆయుధాలుగా మారుతున్నాయని హెచ్చరించారు. శాంతి, భద్రత, స్థిరత్వం కోసం దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఐక్యరాజ్యసమితి 81వ సర్వసభ్య సమావేశంలో జై శంకర్ మాట్లాడుతూ .... అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక వనరుల కొరత వంటి నాలుగు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, ఎరువుల కొరత, ధాన్యం రవాణాలో అవరోధాలు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయని చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారు వాస్తవాలను వక్రీకరించి దానిని సాధారణీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని జైశంకర్ విమర్శించారు. స్నేహం, సౌహార్దం, ఉగ్రవాదం ఏకకాలంలో కొనసాగలేవని స్పష్టం చేశారు. సరిహద్దులు దాటి జరిగే ప్రభుత్వ ప్రోత్సాహిత ఉగ్రవాదానికి పాల్పడే ప్రభుత్వాలను బాధ్యులను చేయాలని అన్నారు.

# నగర అభివృద్ధి నిధులతో జడ్చర్లకు మహర్దశ..

- రూ.12.50 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభం
- చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఘన నివాళులు
- జడ్చర్లకు 50 శాతం MUDA నిధులు ఇవ్వాలి.. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కోరుతా
- జడ్చర్ల నుంచి ఎక్కువ నిధులు.. అభివృద్ధికి ఎక్కువ వాటా కావాలి
- సరస్వతి నగర్ ప్లాట్ల సమస్యకు త్వరలో పరిష్కారం.. NOC ఇప్పించి న్యాయం చేస్తా
- జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రతి వార్డును అభివృద్ధి చేస్తాం..
- రోడ్లు, డ్రైనేజీకి ప్రాధాన్యం.. జడ్చర్ల అభివృద్ధికి భారీగా నిధుల సమీకరణ
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి





**జడ్చర్ల, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా భారీగా నిధులు మంజూరు చేయించి, పలు అభివృద్ధి పనులకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి నేడు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో రూ.12.50 కోట్ల నగర అభివృద్ధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ పనులతో,పాటు 11వ వార్డులో దాదాపు రూ.2 కోట్ల MUDA నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

గత ప్రభుత్వ హయాంలో జడ్చర్లకు రావాల్సిన MUDA నిధులను సక్రమంగా వినియోగించకపోవడంతో పట్టణ అభివృద్ధి వెనుకబడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జడ్చర్ల అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో, మహబూబ్‌నగర్, దేవరకద్ర ఎమ్మెల్యేలతో చర్చించి MUDA నిధుల్లో జడ్చర్లకు 30 శాతం, దేవరకద్రకు 30 శాతం, మహబూబ్‌నగర్‌కు 40 శాతం కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ప్రస్తుతం జడ్చర్ల నియోజకవర్గం నుంచి MUDAకు అత్యధికంగా నిధులు సమకూరుతున్నందున, 30 శాతం కేటాయింపు విధానం సరిపోదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఖమ్మంలో అమలు చేస్తున్న 50 శాతం కేటాయింపు విధానాన్ని జడ్చర్లకు కూడా వర్తింపజేయాలని సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డిని కలిసి కోరనున్నట్లు తెలిపారు. ఏ నియోజకవర్గం నుంచి MUDAకు అధికంగా నిధులు సమకూరుతున్నాయో, ఆనియోజకవర్గ అభివృద్ధికి అనుగుణంగా నిధుల కేటాయింపులు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. జడ్చర్ల పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలకు మెరుగైన రహదారులు, అండర్‌డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అనిరుధ్ రెడ్డి తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే భారీగా MUDA నిధులను మంజూరు చేయించామని అన్నారు.

**సరస్వతి నగర్ ప్లాట్ల సమస్యకు త్వరలో పరిష్కారం**

జడ్చర్ల మున్సిపాలిటీలోని సరస్వతి నగర్ DTCP లేఅవుట్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్లాట్లు ఉన్నప్పటికీ సరైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ లేకపోవడంతో పలువురు బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో జరిగిన తప్పిదాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, త్వరలోనే NOC ఇప్పించి ప్లాట్ల యజమానులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జడ్చర్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తన ప్రధాన లక్ష్యమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

# మూడు మున్సిపాలిటీల అభివృద్ధికి ఎమ్మెల్యే జీఎమ్ఆర్ ప్రత్యేక చొరవ

- MA&UD ప్రిన్సిపల్ సెక్రటరీ టీకే శ్రీదేవితో సమావేశం..
అభివృద్ధి ప్రతిపాదనలపై విస్తృత చర్చ...



**మహబూబ్ నగర్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర మున్సిపాలిటీల పరిధిలో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాల ఏర్పాటుకు అవసరమైన అభివృద్ధి పనులపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ (MA&UD) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టీకే శ్రీదేవి (IAS)ను ఎమ్మెల్యే జీఎమ్ఆర్ కలిశారు. ఈ సమావేశంలో భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర మున్సిపాలిటీలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ప్రతిపాదనలతో కార్యాచరణకు శ్రీకారం;మూడు మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి అవసరమైన వివిధ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే జీఎమ్ఆర్ అందజేశారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర పట్టణ మౌలిక వసతుల మెరుగుదల వంటి ప్రజా అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

కేవలం స్థానికంగా సమస్యలను గుర్తించడమే కాకుండా.. వాటికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ స్థాయిలో సంబంధిత శాఖలతో చర్చించడం ద్వారా అభివృద్ధి పనులకు మార్గం సుగమం చేయడంపై ఎమ్మెల్యే దృష్టి సారిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

**ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా.. నిరంతర కృషి**దేవరకద్ర నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జీఎమ్ఆర్ అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు పట్టణ ప్రాంతాల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై MA&UD ప్రిన్సిపల్ సెక్రటరీ టీకే శ్రీదేవి సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించడం.. వాటి పరిష్కారానికి అధికార యంత్రాంగంతో సమ న్వయం చేయడం..

ప్రతిపాదనలను ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్లడం.. పనులు పూర్తయ్యే వరకు అనుసరణ కొనసాగించడం–ఈ విధమైన కార్యాచరణ ద్వారా దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జీఎమ్ఆర్ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మూడు మున్సిపాలిటీల అభివృద్ధి ప్రతిపాదనలపై ప్రభుత్వ స్థాయిలో జరిగిన ఈ సమావేశం పట్టణ ప్రాంతాల మౌలిక వసతుల బలోపేతానికి తదుపరి చర్యలకు దోహద పడుతుందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# న్యాయ సేవలను గ్రామీణ స్థాయికి చేర్చడమే లక్ష్యం

- గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యం
- గ్రామంలో పేదరిక నిర్మూలనకు అవసరమైన చర్యలను చట్టపరంగా చేపట్టేందుకు కృషి
- జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి ఎస్.ప్రేమలత



**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి ఎస్.ప్రేమలత అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోయిలకొండ మండలం అయ్యవారిపల్లిలో న్యాయ అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్.ప్రేమలత మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు సూచనల మేరకు అయ్యవారిపల్లిని మెగా డ్రైవ్ కింద ఎంపిక చేసి గ్రామ ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నెలరోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి, పేదలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను గుర్తించి సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. గ్రామంలో పేదరిక నిర్మూలనకు అవసరమైన చర్యలను చట్టపరంగా చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు చిన్నచిన్న వివాదాలకు పట్టింపులకు పోయి కేసుల్లో ఇరుక్కో వద్దని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరమైతే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరిం చుకోవచ్చని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు న్యాయ సేవలు పూర్తిస్థాయిలో అందేలా పారా లీగల్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని జడ్జి సూచించారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలను ఇరుపక్షాలతో మాట్లాడి, సమస్య తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు ప్రాథమిక దశలోనే పరిష్కరించేలా కృషి చేయాలని అన్నారు.ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి, జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిబిరంలో ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు గ్రామస్తులకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లకు జడ్జి ఎస్.ప్రేమలత అప్రిషియేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే అర్హులకు యూడీఐడీ, లేబర్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి (ఫ్యామిలీ కోర్టు) పి.ఆంజనేయులు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి మొహమ్మద్ అఫ్రోజ్ అక్తర్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర, ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ కీర్తన, జిల్లా సంక్షేమ అధికారి జరిన బేగం, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, గ్రామ సర్పంచ్ వాగ్య రాము నాయక్, చైల్డ్‌లైన్ ప్రతినిధి చంద్రశేఖర్, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల గుర్తులపై వివాదం.. టీఎంయూ ఆందోళన

- కోర్టు నిర్ణయానికి విరుద్ధంగా గుర్తు కేటాయించారంటూ ఆరోపణలు
- విల్లు-బాణం గుర్తు తమకే చెందుతుందని టీఎంయూ నాయకుల వాదన
- ఆర్వో నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ మజ్దూర్ యూనియన్





**హైదరాబాద్,సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సంబంధించి ఎన్నికల గుర్తుల కేటాయింపు వివాదానికి దారితీసింది ముఖ్యంగా "తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (ఏ-4522)" కు కేటాయించిన విల్లు-బాణం గుర్తు, "ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (ఏ-4528)" కు కేటాయించిన నిచ్చెన గుర్తులపై ఒక వర్గం నుంచి అభ్యంతరాలు వ్యక్త మయ్యాయి..

**టీఎంయూ నాయకుల వాదన ప్రకారం..**

గతంలో విల్లు-బాణం గుర్తు తమ సంఘానికి సంబంధించినదేనని, దానిపై వివాదం నెలకొన్న నేపథ్యంలో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని చెబుతున్నారు.

సంఘం గుర్తు...విల్లు-బాణం గుర్తు మాదే.. నిబంధనల ప్రకారమే కేటాయిం చారు"

**టీఎంయూ ఆరోపణలు నిరాధారం.. ఎన్నికల ప్రక్రియపై అపోహలు వద్దు: అశ్వద్ధామ**

ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో "తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (ఏ-4522)"కు విల్లు--బాణం గుర్తు కేటాయించడంపై వస్తున్న ఆరోపణలను ఆ సంఘం నాయకుడు అశ్వద్ధామ ఖండించారు. రిటర్నింగ్ అధికారి నిబంధనల ప్రకారమే ఎన్నికల గుర్తులను కేటాయించారని ఆయన పేర్కొన్నారు.తమ యూనియన్‌కు కేటాయించిన విల్లు--బాణం గుర్తుపై కొందరు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించేలా ఉన్నాయని అశ్వద్ధామ అన్నారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో రిటర్నింగ్ అధికారి నిర్ణయమే ప్రస్తుతం అమల్లో ఉందని, దానిపై అనవసరమైన అపోహలు సృష్టించడం సరికాదని పేర్కొన్నారు.టీఎంయూ నాయకులు కోర్టు ఉత్తర్వులను ప్రస్తావిస్తూ తమకు విల్లు-బాణం గుర్తు దక్కాల్సి ఉందని చేస్తున్న వాదనలపై స్పందిస్తూ.. కోర్టు ఏ అంశంపై ఎలాంటి ఆదేశాలు ఇచ్చిందో పూర్తిగా పరిశీలించకుండా రిటర్నింగ్ అధికారిపై ఆరోపణలు చేయడం సరికాదని అశ్వద్ధామ అన్నారు. సంఘం గుర్తింపు, ఎన్నికల గుర్తు కేటాయింపు రెండు వేర్వేరు అంశాలని ఆయన పేర్కొన్నారు.

# రిజర్వాయర్‌లో శుభ్రం చేస్తున్న సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు

- సెప్టిక్ ట్యాంకర్లపై పర్యవేక్షణ లేని గ్రామపంచాయతీ అధికారులు.
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు, శివ భక్తులు.



**పర్వతగిరి,సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్వతగిరి మండల కేంద్రంలోని రిజర్వాయర్ కట్ట కింద ఉన్న పంట పొలాల సమీపంలోని కాలువలో సెప్టిక్ ట్యాంకర్ల వ్యర్థాలను వదులుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పచ్చని పంట పొలాల చుట్టూ దుర్వాసన, నీటి కాలుష్యం ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను తరలించిన అనంతరం అదే ట్యాంకర్‌ను రిజర్వాయర్ నీటితో శుభ్రం చేస్తూ, నీటిని కలిసితం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిసున్నారు. ట్యాంకర్ లో మిగిలిన వ్యర్థాలు నీటిలో కలవడంతో రిజర్వాయర్ లోని నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిలోని కలుషిత పదార్థాలను చేపలు తినడం, వాటిని ప్రజలు వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రకృతి ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రిజర్వాయర్ నీటిని, పంట పొలాలను కాపాడాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. సెప్టిక్ ట్యాంకర్లపై గ్రామపంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆరోపిస్తూ, అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## టెక్నాలజీ పరుగుకు తగ్గట్టే.. చట్టాలూ మారాలి

- 'టెక్నాలజీ అండ్ లా' సెమినార్‌లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి




**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా చట్టాలు కూడా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీ లా కళాశాలలో నిర్వహించిన 'టెక్నాలజీ అండ్ లా' సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. విమానయానం, అంతరిక్షం, రక్షణ, సముద్ర, ఐటీ, మేధో సంపత్తి రంగాల్లో న్యాయ నిపుణులకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు న్యాయశాస్త్రంపై పట్టు పెంచుకోవాలని సూచించారు.

"సర్టిఫికెట్ కోసం కాదు.. జ్ఞానం కోసం చదవండి" అని విద్యార్థులకు సూచించారు. నాలెడ్జ్, ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్, కొత్త సాంకేతికతలపై అవగాహన భవిష్యత్ న్యాయవృత్తిలో కీలకమన్నారు. పాలమూరు యూనివర్సిటీకి అండగా ఉంటా పాలమూరు ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించిన బాలకిష్టా రెడ్డి, యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. ముఖ్యంగా లా కళాశాల ప్రగతికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సాంకేతికతను నియంత్రించడంతో పాటు ప్రజా ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమర్థవంతమైన న్యాయ వ్యవస్థ అవసరమన్నారు. అంతరిక్ష సాంకేతికత కమ్యూనికేషన్, వాతావరణం, వ్యవసాయం, నావిగేషన్, విపత్తు నిర్వహణలో కీలకంగా మారిందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్‌బాబు, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రకిరణ్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. భూమయ్య, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

- పీయూలో ఘనంగా 131వ జయంతి వేడుకలు



**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** అన్యాయాన్ని ఎదిరించి ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ అన్నారు.

చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్‌బాబు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పేదలు, రైతుల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె జీవితం మహిళా ధైర్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి, వారి విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రకిరణ్, సీఓఈ డా. ప్రవీణ్, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డా. కుమారస్వామి, ఐక్యూఏసీ డైరెక్టర్ డా. రాజ్‌కుమార్, చీఫ్ వార్డెన్లు డా. కృష్ణయ్య, డా. సంధ్యారాణి, ప్రిన్సిపాళ్లు డా. భూమయ్య, డా. కరుణాకర్‌రెడ్డి, డా. ఈశ్వర్‌కుమార్, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

- తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం
- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్



**హైదరాబాద్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. నిమ్స్ పాత భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ప్రధాన క్యాష్ కౌంటర్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యతో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్రను స్మరించుకున్నారు. భూమి కోసం, పేద ప్రజల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పట్టుదల తెలంగాణ సమాజంలో చైతన్యానికి బాటలు వేసిందని తెలిపారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకోవడంతో పాటు, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ పరంజ్యోతి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, వివిధ నిమ్స్ ఉద్యోగ సంఘాల నాయకులు, వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బదిరుల హక్కులు, ఆరోగ్యం న్యాయ సహాయంపై అవగాహన కల్పించాలి




**నర్సంపేట, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ బదిరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ( డి ఎల్ ఎస్ ఏ ), వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బదిర విద్యార్థులు మరియు బదిరుల కోసం ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరాన్ని శనివారం శ్రీ వెంకటేశ్వర బదిరుల పాఠశాలలో హన్మకొండ,సుబేదారి నిర్వహించారు.

ఈ కార్యక్రమానికివరంగల్ జిల్లా ప్రిన్సిపాల్, సెషన్స్ జడ్జి వీబీ నిర్మల గీతాంభ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. బదిరులు, దివ్యాంగుల ఆరోగ్యం, హక్కులు, న్యాయ పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డి ఎల్ ఎస్ ఏ ) వరంగల్ జిల్లా సెక్రటరీ . పూజ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి వ్యక్తికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని, దివ్యాంగులు తమ హక్కుల పరిరక్షణ కోసం న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు.వరంగల్ జిల్లా డి డబ్ల్యూ ఓ రాజమణి మాట్లాడుతూ, బదిర విద్యార్థులు, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శిబిరంలో వైద్య నిపుణులచే బదిర విద్యార్థులు మరియు బదిరులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, సాధారణ ఆరోగ్య సమస్యలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత రెడ్డి, అంగోత్ వీరన్న నాయక్, వరంగల్ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎన్ పి ఆర్ డి ఇండియా వరంగల్ జిల్లా అధ్యక్షులు అడ్డ రాజు జిల్లా, పాఠశాల ప్రిన్సిపాల్, డాక్టర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బదిర విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. బదిరులు సమాజంలో సమాన అవకాశాలతో గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఆరోగ్యం, విద్య, ఉపాధి, న్యాయ సహాయం మరియు సామాజిక భద్రత వంటి అంశాల్లో నిరంతర సహకారం అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

### వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా

## నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**నల్గొండ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిన వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ..

చాకలి ఐలమ్మ భూస్వామ్య దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప వీరవనిత అని అన్నారు.అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

### - ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మనం ఆదర్శంగా తీసుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం రోజు జిల్లా బి. అభివృద్ధి శాఖ ఆధ్వర్యం లో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి జిల్లా ఇంచార్జి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా , భూమి , భుక్తి కోసం చేసిన పోరాటాలను గుర్తుచేస్తూ వారి ఆశయాలను మనం పూర్తిగా సాధించేందుకు కృషి చేయాలని , తద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడినట్లు అవు తుందని అన్నారు. వారి పోరాటాలు , ఆశయాలు అందరికి తెలియాలని రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న దని తెలిపారు. కార్య క్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాలు , పోరాటం కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ , అడ్మినిస్ట్రేషన్ అధికారి అంజిరెడ్డి , జిల్లా బి.సి అభివృద్ధి అధికారి సుబ్బారెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు , వివిధ సంఘాల ప్రతినిధులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహణ



**నల్గొండ సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నల్లగొండ మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటాన్ని కొనియాడారు.కార్యక్రమంలో పీఏ ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కోటి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాదం అనిల్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, పెరిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం

### - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ వీరనారి, ధీర మహిళ చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే దీూ= పిలుపునిచ్చారు. సామాజిక మార్పు కోసం ఆమె చేసిన పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, వన్ టౌన్ పట్టణ అధ్యక్షులు ఇంద్ర కుమార్, కౌన్సిలర్లు జావిద్, బూడిద సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డాక్టర్ రాజు, దేసిడి శేఖర్ రెడ్డి, యాదగిరి, రజక సంఘం నాయకులు, దుర్గయ్య, బంటి వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నాయకురాలు కవిత, వివిధ కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మదర్సా మదీనతుల్ ఉలూమ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బత్తుల



**మిర్యాలగూడ సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని మదర్సా మదీనతుల్ ఉలూమ్ ను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మదర్సా మత పెద్దలు, నిర్వాహకులు, విద్యార్థులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా మాట్లాడి మదర్సాలో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, వారి విద్యాభ్యాసం తదితర అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ కౌన్సిలర్ జావేద్, సజ్జల రవీందర్ రెడ్డి, మదర్సా మత పెద్దలు, నిర్వాహకులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు అక్రమిస్తే కఠిన చర్యలు

### ◆ సర్వే నెంబర్ 540,88,68 ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల పరిశీలన...

**మఠంపల్లి, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** భూముల వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా 22-ఎ నిషేధిత జాబితా అంశం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలోమఠంపల్లి మండలంలోని పెదవీడు,మట్టపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 540,88,68 ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆదాబ్ హైదరాబాద్ పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం స్థానికంగా ఆసక్తి రేకెత్తించింది.ఈ విషయంపై జిల్లా ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు మండలంలో అన్యక్రాంతమైన ప్రభుత్వ భూముల రికార్డులు,ఆక్రమణల పరిస్థితి,హద్దులు, భూముల వినియోగం చిట్టాపై మండల తహసిల్దార్ వెంటనే నివేదిక సమర్పించాలని కోరడంతో మఠంపల్లి తహసీల్దార్ హిమ బిందు,ఆర్ఐ శివ తదితర రెవెన్యూ అధికారులు ఆయా భూముల్లో శుక్రవారం పర్యటించి ప్రభుత్వ దస్త్రాల్లో నమోదైన వాటి ప్రస్తుత వివరాలు,స్థితిగతులు,భూముల హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని రెవెన్యూ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



సర్వే నంబర్ 540 లోని ప్రభుత్వ భూములపై ప్రత్యేక పరిశీలన

పెదవీడు రెవెన్యూ పరిధిలోని కామాక్షి సిమెంట్ పరిశ్రమ గతంలో మైనింగ్ కొరకు లీజు తీసుకున్న భూములకు సంబంధించి సుమారు 46 ఎకరాల భూమి రైతుల నుంచి కొన్న ప్రభుత్వ భూములకు లీజు చెల్లకపోవడంతో ప్రభుత్వానికి తిరిగి అప్పగించింది.అయితే అట్టి భూముల ప్రస్తుత పరిస్థితి, ఆక్రమణలు,భూముల్లో నిర్మాణాలు,వ్యవసాయ క్షేత్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిశీలించారు.వాటి భూములకు సంబంధించి రికార్డుల్లో నమోదైన వివరాలు, భూముల హద్దులు పరిశీలించి సంబంధిత వివరాలను తాజాగా నమోదు చేశారు.అదే విధంగా మట్టపల్లి రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 88,68 పులిచింతల ప్రాజెక్ట్ ముంపు భూముల్లోని కొందరు వ్యక్తులు అక్రమంగా చెట్లు నరికివేసి,భూమి చదును చేసి,ఆక్రమించుకొని పొలం చేసినట్లుగా స్థానికులు ఫిర్యాదు చేయడంతో వాటి భూములపైనా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక తయారు చేశారు.ఈ సందర్భంగా హుజూర్ నగర్ ఆర్డీఓ ద్వారా కలెక్టర్ కు నివేదిక పంపుతామని తహసిల్దార్ స్పష్టం చేశారు.

**అక్రమణల ఆరోపణల నేపథ్యంలో అక్రమార్కుల్లో టెన్షన్**

మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి గతంలో ఆక్రమణల ఆరోపణలు, భూముల హద్దులు, రికార్డుల మార్పులు చేసినట్లుగా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారుల తాజా తనిఖీలకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఏ ప్రాంతంలోనైనా ఆక్రమణలు జరిగినట్లు ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.ముఖ్యంగా రెవెన్యూ,అటవీ శాఖల పరిధిలోని భూములకు సంబంధించిన రికార్డులు, హద్దులు, భూముల వర్గీకరణ, ప్రస్తుత పరిస్థితిపై ఉమ్మడి సర్వే నిర్వహించి సమగ్ర పరిశీలన జరిపి స్పష్టత ఇవ్వాలని స్థానికులు,రైతులు అధికారులను కోరుతున్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వెలువడే నివేదికపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఏయే భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి వాటి ప్రస్తుత తాజా పరిస్థితి ఏమిటి ఎంత వరకు ఆక్రమణలు జరిగాయి తదుపరి చర్యలు ఏమిటనే అంశాలపై అధికారుల నివేదికలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ పరిశీలనలో రెవెన్యూ అధికారుల వెంట హుజూర్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా పకడ్బందీగా అమలు చేయాలి

### - మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం: ఎస్ఎఫ్ఐ

**మిర్యాలగూడ సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టడంతో పాటు మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) దామరచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్న ప్పటికీ మహిళలు, బాలికలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించ లేకపోతున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావడం లేదని విమర్శిం చారు. దేశంలో తరచూ మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచా రాలు, హత్యలు చోటుచేసుకుంటున్నప్పటికీ వాటిని అరికట్టేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల బీహార్‌లో మైనర్ బాలికపై జరిగిన దాడి, ఢిల్లీలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలతో పాటు తెలంగాణలోని గోదావరిఖనిలో మహిళ హత్యకు గురైన ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "బేటీ బచావో.. బేటీ పడావో" నినాదం కేవలం ప్రచార కార్యక్రమంగా కాకుండా, మహిళలు మరియు బాలికలకు వాస్తవ భద్రత కల్పించేలా ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని కోరారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళా రక్షణ చట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, బాలికలకు



సంపూర్ణ భద్రత కల్పించే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని వీరన్న నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దత్తు, నాగరాజు, నవీన్, జనని, త్రివేణి, లక్ష్మి, గీత, సుప్రజ, విజనిరమల, జ్యోతి, నాగలక్ష్మి, ఉషారాణి, సానియా, వెన్నెల, షరీఫ్ పాల్గొన్నారు.

## పొద్దుటూరు,ఏదుల్లగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలి

### - ఆర్టీసీఅధికారులు,అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య వైఖరిని వీడాలి...

### - సీపీఎం డిమాండ్ ..

**వలిగొండ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల పరిధిలోని పొద్దుటూరు,ఎదుల్లగూడెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ అధికారుల మరియు అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్య వైఖరిని వీడాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎదుళ్లగూడెం స్టేజి వద్ద సిపిఎం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఏదుళ్ళగూడెం గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఇప్పటికే అనేకమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆర్టీసీ



యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కు,స్థానిక ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకునే పరిస్థితులు లేవని ఈ రెండు గ్రామాలకు సంబంధించిన అనేకమంది ప్రయాణికులు విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు వెంటనే ఇప్పటికైనా తమ నిర్లక్ష్య వైఖరిని విడనాడి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు స్థానిక భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అనేక గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్నారని పొద్దుటూరు, ఎదుల్లగూడెం గ్రామాలకు మాత్రం గత మూడు సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సు ఎందుకు వేయలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు ఇప్పటికైనా ఆ గ్రామ ప్రజల తీవ్రమైన సమస్యగా ఉన్న బస్సు సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు..

ఈ కార్యక్రమంలో ఎదుళ్ళగూడెం గ్రామ సర్పంచ్ కొంతం శ్రీనివాస్ గౌడ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, మాజీ ఎంపీటీసీ భూమి మాధవి బాలశంకర్, సిపిఎం శాఖ కార్యదర్శి పలుసం లింగం, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు పెద్ద బోయిన భీమరాజు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దండు వేణు, సిపిఎం నాయకులు బత్తుల నరసింహ, బత్తిని అంజమ్మ, బొడ్డు శంకర్, పెద్ద బోయిన శివశంకర్, విద్యార్థినీ విద్యార్థులు, రెండు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## కొండమల్లేపల్లి హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

### - 70 కిలోల నిబంధనలకు విరుద్ధమైన ఆహార పదార్థాల తొలగింపు

**నల్గొండ, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** కొండమల్లేపల్లి టీజీ సేఫ్ కమిషనర్ ఆదేశాల మేరకు హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో కొనసాగుతున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కొండమల్లేపల్లిలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి పర్యవేక్షణలో నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శివశంకర్ రెడ్డి సాగర్ రోడ్డులోని హోటల్ 7 (౹7), ఎస్వీ ఫుడ్ కోర్ట్‌లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆహార తయారీ ప్రదేశాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలు సక్రమంగా పాటించకపోవడం, రిఫ్రిజిరేటర్లలో లేబులింగ్ లేకుండా ఆహార పదార్థాలను నిల్వ చేయడం, రిఫ్రిజిరేటర్లను సరిగా శుభ్రం చేయకపోవడంతో ఫంగస్, దుమ్ము పేరుకుపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. వంటగదిలో బొద్దింకలు కూడా కనిపించినట్లు తెలిపారు.అలాగే పాడైపోయిన ఆహార పదార్థాలతో పాటు బిర్యానీ, సోడాలు,



సాస్‌లు, చేపలు, రొయ్యలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ తదితర పదార్థాలను నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహార పదార్థాల్లో అనుమానాస్పద సింథటిక్ రంగుల వినియోగంపై అనుమానం వ్యక్తం చేసిన అధికారులు సంబంధిత నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు.తనిఖీల్లో నిబంధనలకు అనుగుణంగా లేని సుమారు 70 కిలోల ఆహార పదార్థాలను గ్రామపంచాయతీ ట్రాక్టర్, సిబ్బంది సహకారంతో అక్కడికక్కడే తొలగించి పారవేశారు. గుర్తించిన లోపాలను సరిదిద్దేందుకు రెండు సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయాలని అధికారులు సిఫారసు చేశారు.

పరిశుభ్రత, ఆహార నిల్వ, రిఫ్రిజిరేటర్ల నిర్వహణ, లేబులింగ్, పురుగుల నియంత్రణ తదితర అంశాల్లో లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఆహార కార్యకలాపాలను నిలిపివేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారి నిర్వాహకులకు సూచించారు. ప్రయోగశాల నుంచి వచ్చే నమూనాల పరీక్షా నివేదికల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు కలిగి ఉండాలని, లైసెన్సులో పేర్కొన్న నిబంధనలతో పాటు ఆహార భద్రత, పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి వి. జ్యోతిర్మయి సూచించారు. వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని ఆమె స్పష్టం చేశారు.

## ముదిరాజుల సమస్యను ప్రస్తావించిన బండి సంజయ్

### - ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన పి. వెంకటేశ్వర ముదిరాజ్

**హైదరాబాద్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ముదిరాజ్ సమాజం ఎదుర్కొంటున్న చిరకాల సమస్యలు, ముఖ్యంగా రిజర్వేషన్ అంశాన్ని పార్లమెంట్ వేదికగా స్పష్టంగా ప్రస్తావించి, ముదిరాజుల సామాజిక పరిస్థితిని వివరించిన కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ నాయ కుడు బండిసంజయ్‌కుమార్‌కు తెలంగాణ ముదిరాజ్ సమాజం తర ఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలంగాణ ముది రాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పి వెంకటేశ్వర ముదిరాజ్ తెలిపారు. ముదిరాజ్ సమాజం రిజర్వేషన్ సమస్య ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని, ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ వివిధ రాజకీయ పార్టీలు, నాయకులు ముది రాజులకు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారిందని ఆయన అన్నారు. హామీలు ఇచ్చిన తర్వాత వాటి అమలుపై మాత్రం స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని పేర్కొన్నారు.2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్, ముత్రాసి, తెనుగోలు వర్గాలను బీసీ- డి నుంచి బీసీ- ఏ కేటగిరీలోకి మార్చే హామీని ప్రకటించినట్లు అందుబాటులో ఉన్న ఎన్నికల హామీ రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ మార్పు అమలైనట్లు ధృవీకరించే తుది ప్రభుత్వ ఉత్తర్వు ప్రస్తుతం అందుబాటులో లేదని కూడా ఆ రికార్డులు సూచిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ముదిరాజుల చిరకాల డిమాండ్‌ను పరిష్కరిస్తుందని సమాజం ఆశించిందని, కానీ రిజర్వేషన్ అంశంపై ఇప్పటికీ స్పష్టమైన తుది నిర్ణయం కోసం ముదిరాజులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.



## స్వామివారి సన్నిధిలో ప్రముఖులు..

### - ఆలయ సంప్రదాయాలతో స్వాగతం..

### - వేదాశీర్వచనంతో ఆశీర్వాదం..

### - లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటంతో సత్కారం.



**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానాన్ని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే బోర్డు మెంబర్ (ఫైనాన్స్), భారత ప్రభుత్వ ఎక్స్-ఆఫీషియో సెక్రటరీ మంజుషా జైన్, ఐ.ఆర్.ఏ.ఎస్., అలాగే తెలంగాణ లోకాయుక్త జస్టిస్ ఏ. రాజశేఖర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సంప్రదా యాల ప్రకారం అర్చకులు ప్రముఖులకు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వయంభు మూర్తులను దర్శించుకుని, ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం వేదపండితులు, ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. .కాగా, ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దోర్బల భాస్కర్ శర్మ ప్రముఖులకు స్వామివారి లడ్డూ ప్రసాదంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి, శ్రీధరాచార్యులు, మాధవా చార్యులు, వేదపండితులు రాధాకృష్ణమూర్తి, ఆలయ ఎస్పీఎఫ్ సీఐ శేషగిరిరావు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం.

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్.





**ఏన్కూరు, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ఏన్కూరు మండల పరిధిలోని జన్నారం గ్రామంలో ఇంద్ర మిల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ మహోత్సవానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని , ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ఎవరు అధైర్య పడవద్దు అని ఆయన హామీ ఇచ్చారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయట మే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు . కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఇంటి యజమాని కుమారుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, నల్లమల శివకుమార్ ఓబీసీ మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు,కొప్పుల ప్రభావతి రెడ్డి ,పంతగాని నరేష్, స్వర్ణ కృష్ణయ్య, స్వర్ణ శ్రీనివాసరావు గుత్తా నాగేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు మెరుగైన సేవలు అందించాలి



**శామీర్‌పేట, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం– 2026లో భాగంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో శామీర్‌పేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో శనివారం 'వృద్ధాప్యంలో సామర్థ్య నిర్మాణం' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులకు 'వృద్ధాప్యంలో సామర్థ్య నిర్మాణం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డే కేర్ సెంటర్లు వయోవృద్ధులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా అవసరమైన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వయోవృద్ధుల సంక్షేమం, వారి అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, సంక్షేమ శాఖ పర్యవేక్షకులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేబర్తి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు రవీందర్ రావు పదవీ విరమణ మహోత్సవం





**మర్కుక్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టేకుమల్ రవీందర్ రావు పదవీ విరమణ మహోత్సవం శనివారం గ్రామస్తులు, బంధువులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో రవీందర్ రావును ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు రవీందర్ రావు మాట్లాడుతూ తన సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తి జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. తన విద్యార్థి దశను, ఉపాధ్యాయ వృత్తిలో ఎదురైన మధుర అనుభూతులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకుంటూ కాస్త భావోద్వేగానికి లోనయ్యారు. తన విధి నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు రామ్ సాగర్ లక్ష్మణ్ గౌడ్ హాజరయ్యారు. తన గురువు రవీందర్ రావు గురించి ఆయన సభలో మాట్లాడుతుండగా ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. సార్ కేవలం చదువు మాత్రమే చెప్పలేదని, తమ జీవితాలకు ఒక మార్గాన్ని చూపించారని కొనియాడారు. తన ఎదుగుదలలో గురువు గారి పాత్ర మరువలేనిదని చెబుతూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. రవీందర్ రావు సార్ కేవలం చదువు మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పించి తన ఎదుగుదలకు కారణమయ్యారని అన్నారు. ఈ వీడ్కోలు మహోత్సవంలో చేబర్తి గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి, మాజీ సర్పంచ్ ఎర్రబాగు అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు, రవీందర్ రావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

# 30 లోపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు పూర్తి చేయాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా





**నిజామాబాద్, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు స్పష్టమైన గడువు విధించారు.నిజామాబాద్ నగరం సహా ఆర్మూర్,బోధన్,రుద్రూర్,మోర్తాడ్,బాల్కొండలలో అర్హులైన లబ్దిబారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన చోట లబ్దిదారులకు కేటాయింపులు జరుపుతున్నామని,ఇదే తరహాలో మిగితా చోట్ల కూడా ఈ నెలాఖరు లోగా కేటాయింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అర్హులైన లబ్దిదారుల జాబితాను సమగ్ర పరిశీలన జరపాలని,ఆ జాబితా ఆధారంగా డ్రా పద్ధతిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలన్నారు.జాబితాలో అనర్హులు ఉంటే వారి పేర్లను తొలగిస్తూ,అనర్హతకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,దివ్యాంగులు తదితర కేటగిరీల వారీగా నిర్దేశించిన రిజర్వేషన్ల మేరకు రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు.ఎలాంటి తప్పిదాలు,అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు జరపాలని అన్నారు.క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు.ఎట్టి పరిసితుల్లోనూ ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,హౌసింగ్ ఇంచార్జి పీ.డీ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,హౌసింగ్ ఏ.ఈ నివర్తి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 5-95-99 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

- మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో టీజీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఏ. రాజేశం సమీక్ష



**మల్కాజిగిరి, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** హెచ్ఐవీ, క్షయ వ్యాధి నియంత్రణకు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేసి, 95–95–99 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని టీజీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, క్షయ కార్యక్రమ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు డా. ఏ. రాజేశం సూచించారు. మానిటరింగ్ అండ్ అసెస్మెంట్ ఆఫ్ సర్వీసెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మల్కాజిగిరి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించిన ఆయన హెచ్ఐవీ, క్షయ సేవల అమలుతీరును పరిశీలించారు.ఆసుపత్రిలోని సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం రికార్డులు, రిజిస్టర్లు, పనితీరు సూచికలను పరిశీలించారు. ప్రతి నెల నిర్వహిస్తున్న హెచ్ఐవీ పరీక్షలు, గుర్తిస్తున్న పాజిటివ్ కేసులు, వారిని యాంటీ రిట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేస్తున్న తీరును సమీక్షించారు. హెచ్ఐవీ–క్షయ వ్యాధి పరస్పర రిఫరల్ విధానాన్ని పరిశీలించి, పరీక్షా కేంద్రం నుంచి క్షయ నిర్ధారణ కేంద్రానికి, అక్కడి నుంచి పరీక్షా కేంద్రానికి జరుగుతున్న రిఫరల్స్, అనుసంధానం, లబ్ధిదారుల అనుసరణ వివరాలను తెలుసుకున్నారు.క్షయ సేవలపై సమీక్షఅనంతరం సీబీనాట్ కేంద్రాన్ని సందర్శించి క్షయ వ్యాధికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. హెచ్ఐవీ–క్షయ సహవ్యాధి ఉన్న వారికి అందుతున్న చికిత్స, అనుసరణ, చికిత్స స్థితిపై వివరాలు తెలుసుకున్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న అర్హులైన వారికి నిర్వహిస్తున్న వైరల్ లోడ్ పరీక్షలు, వైరల్ లోడ్ అణచివేత స్థితిని సమీక్షించారు.రక్తనిధి కేంద్రం పరిశీలనఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం స్వచ్ఛంద రక్తదానాల సేకరణ, రక్త పరీక్షల వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా హెచ్ఐవీ పరీక్షల పరిస్థితిని సమీక్షించారు. రక్త పరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన వారిని చికిత్సకు అనుసంధానం చేయడం, అనుసరణ కొనసాగిస్తున్న తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రెండో 95 లక్ష్యంపై దృష్టిమేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇప్పటికే మొదటి, మూడో 95 లక్ష్యాలను సాధించిందని డా. రాజేశం తెలిపారు. ప్రస్తుతం రెండో 95 లక్ష్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గుర్తించిన హెచ్ఐవీ బాధితులను యాంటీ రిట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేసి, వారు క్రమం తప్పకుండా చికిత్స పొందుతున్నారో లేదో నిర్ధారించాలని చెప్పారు.జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ఆరోగ్య సంస్థలను జిల్లా బృందం సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న హెచ్ఐవీ బాధితుల వివరాలను సేకరించాలని సూచించారు. అవసరమైన వారిని సంబంధిత కార్యక్రమ సేవలకు అనుసంధానం చేయడంతో పాటు చికిత్స కొనసాగింపు, అనుసరణను పటిష్ఠం చేయాలని అన్నారు. ఖచ్చితమైన నమోదు, సకాలంలో రిఫరల్స్, ఆసుపత్రుల మధ్య సమన్వయం, నిరంతర అనుసరణ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ, క్షయ సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సంయోజకుడు బాబు రావు, కార్యక్రమ అధికారి డా. వై. శ్రీదేవి, వైద్య పర్యవేక్షణాధికారి డా. రాధ, ఆర్ఎంఓ డా. మాధురి, పీఆర్ఓ డా. పి. వినోద్, డిషా సీపీఎం సంజీవ్, ఐసీటీసీ సలహాదారు రమేష్, ఎస్ఎస్‌కే మేనేజర్ కల్పనతో పాటు క్షయ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన




**ముత్తారం, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ముత్తారం మండలం మచ్చుపెట గ్రామంలో శనివారం జాతియ ప్రకృతి వ్యవసాయ మిషన్ పై రైతులకు అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూష అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులు,పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులైన జనుము,జీలుగ,పిల్లిపెసర వంటి పంటలను సాగు చేయడం,పశువుల పేడ,వర్మీకంపోస్ట్ వినియోగం,అంతర పంటల సాగు చేపట్టాలని అన్నారు.అలాగే జీవ ఎరువులైన అజోల్లా,అజోస్పైరిలం,పీఎస్‌బీ,అజటోబాక్టర్,జీవ శిలీంద్ర నాశనులైన ట్రైకోడెర్మా విరిడీ,సూడోమోనాస్, సహజ కీటక నాశనిగా వేపనూనె,వేపపిండి వంటి వాటిని వినియోగించాలని సూచించారు.రైతులు పంటలతో పాటు ఆవులు,గేదెలు,ఎడ్లు,మేకలు,కోళ్లు వంటి పశుపక్ష్యాదులను పెంచుకుంటూ సమగ్ర వ్యవసాయం చేపట్టాలని కోరారు.దేశవాళీ జాతులైన గిర్,సహివాల్,ఒంగోలు ఆవుల పెంపకాన్ని ప్రోత్సహించాలని అన్నారు.ఆవు పేడ,ఆవు మూత్రంతో తయారు చేసే జీవామృతం,బీజామృతం వంటి ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్లను వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మచ్చపేట సర్పంచ్ చిలువేరి జ్యోతి లక్ష్మణ్,వార్డ్ మెంబర్ సాగర్,ఏఈఓ శశిధర్,కృషి సఖీలు,సౌఖ్య,విత్తన ధ్రువీకరణ సంస్థ వాలంటీర్ సుమశ్రీ తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## బూర్రిపాలెంలో సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



○ హెలిప్యాడ్, సభా వేదిక, రూట్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి రూరల్ మండలం బూర్రిపాలెం గ్రామంలో అక్టోబరు 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ పరిశీలించారు. పేద ఎస్టీ యానాది కుటుంబాలకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఇంటి పట్టాలు అందించే కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల వద్ద ప్రతిపాదిత హెలిప్యాడ్ ప్రాంతం, కార్యక్రమ వేదిక, ముఖ్యమంత్రి రూట్, పార్కింగ్ ప్రాంతాలు, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ, కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశమై హెలిప్యాడ్, సభా వేదిక, రూట్ తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన బందోబస్తు, సమన్వయంతో కూడిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ జనార్ధన్, తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్, తెనాలి రూరల్ ఎస్ఐ, తెనాలి వన్‌టౌన్ సీఐ రాంబాబు, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా జోగయ్య



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా బ్రహ్మంగారిమఠానికి చెందిన జోగయ్య నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డికి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డికి పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముత్యాల రామ గోవింద్ రెడ్డికి మరియు నియోజకవర్గ మండల స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడిగా గడ్డం గంగినాయుడు ఏకగ్రీవ ఎన్నిక



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్రంలోని పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం మరియు కళ్యాణ మండపం నూతన అధ్యక్షుడిగా గడ్డం గంగినాయుడుని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. స్థానిక పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం మరియు కళ్యాణ మండపంలో ఆదివారం కమిటీ సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. గత కొంత కాలంగా అధ్యక్షుడిగా కొనసాగుతున్న తిప్పన బ్రహ్మయ్య అనివార్య కారణాల వల్ల తన వ్యక్తిగత పనుల ఒత్తిడి కారణంగా స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో ఖాళీ అయిన అధ్యక్ష పదవికి కమిటీలో డైరెక్టర్ గా కొనసాగుతున్న గడ్డం గంగినాయుడు పేరును సభ్యులు ప్రతిపాదించారు. ఆయన సేవలను, సత్రం అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి కమిటీ సభ్యులు, పట్రా కులస్తులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో ఆయన నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు గడ్డం గంగినాయుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కమిటీ సభ్యులకు, కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సత్రం, కళ్యాణ మండపం అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం కమిటీ అభివృద్ధి కొరకు మరికొంత మంది కమిటీ డైరెక్టర్లుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్రా నాయుళ్ల సంఘం కమిటీ సభ్యులు, కుల పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా బూస్ట్‌తో ఏపీ పర్యాటకానికి గ్లోబల్ ప్రచారం



○ ఇన్ఫ్లుయెన్సర్లతో కలిసి బంతి భోజనం చేసిన మంత్రి కందుల దుర్గేష్

○ స్వయంగా పూతరేకులు తయారు చేసి వడ్డించిన మంత్రి

**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలకు ప్రపంచస్థాయి ప్రచారం కల్పించేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను భాగస్వాములుగా చేసుకుంటున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో కలిసి మంత్రి బంతి భోజనం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అరిటాకులో సంప్రదాయ ఆంధ్ర వంటకాలను వడ్డించి, ఇన్ఫ్లుయెన్సర్లకు స్వయంగా భోజనం వడ్డించారు. ఆంధ్ర వంటకాల రుచిని ఆస్వాదించిన ఇన్ఫ్లుయెన్సర్లు భోజనం అద్భుతంగా ఉందంటూ ప్రశంసించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రసిద్ధ మిఠాయి పూతరేకులను మంత్రి స్వయంగా తయారు చేసి అతిథులకు వడ్డించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాష్ట్రంలో ఇంకా విస్తృత ప్రచారానికి నోచుకోని పలు అందమైన పర్యాటక ప్రాంతాలను సోషల్ మీడియా వేదికగా దేశ, విదేశాల్లోని ప్రజలకు పరిచయం చేయాలని మంత్రి ఇన్ఫ్లుయెన్సర్లను కోరారు. ఏపీ పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ పాయింట్ వద్ద మంత్రి, అధికారులు, ఇన్ఫ్లుయెన్సర్లు ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

## యుద్ధప్రాతిపదికన పార్కులు వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం

○ నియోజవర్గంలో నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటుకు చర్యలు

○ ప్రజలకు ఆరోగ్యంతోపాటు ఆహ్లాదమైన ఆహ్లాదకరమైన వాతావరణం

○ ఇప్పటికే 100 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం

○ బీఆర్ స్టేడియాన్ని పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, నగర కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో సమాన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని,, అందులో భాగంగా నాలుగు ప్రదేశాలలో పార్కులు వాకింగ్ ట్రాక్ లతోపాటు డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీద్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శనివారం స్థానిక బిఆర్ స్టేడియంతోపాటు పొన్నూరు రోడ్ లో పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని నగర కమిషనర్ మయూర్ అశోక్ తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు ఈ సందర్భంగా బీఆర్ స్టేడియంలో వాలీబాల్ కోర్టు , డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం పొన్నూరు రోడ్డులోన ఖాళీ స్థలాన్ని వాకింగ్ ట్రాక్ పార్కు నిర్మాణానికి పరిశీలించారు. నల్లచెరువుతోపాటు బొంగరాల వీడు వద్ద వెల్ఫేర్ స్థలంలో వాకింగ్ ట్రాక్, పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. వీటిని యుద్ధప్రాతిపదికన చేపట్టి త్వరలోనే నియోజకవర్గ ప్రజలకు అందించనున్నామన్నారగుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఆరోగ్యంపాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 100 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. వాకింగ్ ట్రాక్ లు, పార్కుల నిర్మాణంతో ఆయా ప్రాంతాలకు కొత్త కళ వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికి అందేలా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చిబా తనను సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు.

## గుంటూరు అభివృద్ధిలో ఇన్‌ఫ్లుయెన్సర్లు భాగస్వాములు కావాలి

○ ప్రతి ఇన్‌ఫ్లుయెన్సర్ గుంటూరు కోసం ఒక అవగాహన వీడియో చేయాలి

○ సమస్యలపై విమర్శలకే పరిమితం కాకుండా పరిష్కార మార్గాలు చూపాలి

○ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర అభివృద్ధి, ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. తన నివాసంలో నగరానికి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నగరంలోని సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అంశాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ నగర పరిశుభ్రత, క్రమబద్ధత విషయంలో ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల్లో బాధ్యత, అవగాహన కూడా కీలకమన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరువైన ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సామాజిక బాధ్యతలో భాగంగా గుంటూరు నగర ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తాము రూపొందించే వీడియోల్లో కనీసం ఒక వీడియోను గుంటూరు నగరం, ప్రజల కోసం కేటాయించాలని సూచించారు. వ్యక్తులు, వ్యవస్థలను విమర్శించడం కంటే సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రజల్లో సానుకూల మార్పు తీసుకువచ్చేలా అవగాహన వీడియోలు రూపొందించాలని కోరారు.

ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రస్తావించిన సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ, వాటి పరిష్కారానికి కాలపరిమితితో చర్యలు చేపడతామని తెలిపారు. సాధ్యమైన సమస్యలను మూడు నెలల్లో పరిష్కరించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

మరో మూడు నెలల తర్వాత ఇన్‌ఫ్లుయెన్సర్లతో మళ్లీ సమావేశమై చేపట్టిన చర్యల పురోగతిని సమీక్షించడంతో పాటు కొత్త సూచనలు స్వీకరిస్తామని వెల్లడించారు. యువతకు దిశానిర్దేశం, చిన్నారుల అభివృద్ధి, ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాల రూపకల్పనలో ఇన్‌ఫ్లుయెన్సర్ల సహకారం అవసరమని పేర్కొంటూ గుంటూరు అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## తోట సుధాకర్ ప్రసాద్ సేవలు చిరస్మరణీయం



○ ఏపీ ఎన్జీజీవో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషిచేసిన తోట సుధాకర్ ప్రసాద్ సేవలు ఏపీ ఎన్జీజీవో సంఘం ఉన్నంతకాలం గుర్తుండిపోతాయని సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుంటూరులోని ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ జిల్లా హోంలో తోట సుధాకర్ ప్రసాద్ 25వ వర్ధంతి సభను నిర్వహించారు. రాష్ట్ర సంఘ అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం తోట సుధాకర్ ప్రసాద్ చూపిన చొరవ, అంకితభావం ఆదర్శనీయమన్నారు. అలాంటి నాయకులు సంఘంలో పనిచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ తోట సుధాకర్ ప్రసాద్ సేవలను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత తరం ఉద్యోగ సంఘ నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఏపీ గురుకుల పాఠశాలల గుంటూరు జిల్లా అధ్యక్షుడు చుక్క నాగభూషణం, కార్యదర్శి రమీ బాబు, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుకుమార్, నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏపీ ఎన్జీజీవో గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్‌కుమార్, కార్యదర్శి జి.వి. కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మైలపల్లి శ్రీనివాసరావు, ట్రెజరర్ భవనారాయణ, జాయింట్ సెక్రటరీలు టి.వి. శ్రీనివాసరావు, వి. నాగేశ్వరరావు, గుంటూరు నగర మహిళా చైర్మన్ అరుణ, వైస్ ప్రెసిడెంట్ శైలజ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే పుట్టా



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు నియోజకవర్గం లోని ఖాజీపేట మండలం కొత్తపేట గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలో ఆదివారం మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మండల టిడిపి నాయకులు ఎమ్మెల్యే కు శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వార్డు సచివాలయ ఉద్యోగుల అరెస్టు సిగ్గుచేటు




○ సమస్యలు పరిష్కరించమని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రామ,ఏఐవైఎఫ్ కడప జిల్లా కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం వారిని అరెస్టు చేయించడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య తీవ్రంగా ఖండిస్తున్నదని AIYF జిల్లా కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపడితే వారి సమస్యలను వినాల్సిన ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపడితే, వారి సమస్యలను వినాల్సిన ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం నేరం కాదని వారు పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగులపై నిర్బంధ చర్యలను నిలిపివేయాలని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని జిల్లా సమితి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకపోతే ఉద్యోగులు భవిష్యత్తులో చేపట్టే ప్రజాస్వామ్యబద్ధమైన అన్ని కార్యక్రమాలకు AIYF సంఘీభావం ,మద్దతు తెలియజేస్తామని పేర్కొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దండి : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

○ జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీకి పిలుపు

○ రాజకీయాలకు అతీతం - వ్యాపారుల ప్రయోజనాలకే ప్రాధాన్యం

○ టీఎల్వీ అభినందన సభలో ఎమ్మెల్సీ దిశానిర్దేశం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** రాజకీయాలకు అతీతంగా.. వ్యాపారస్తుల ప్రయోజనాలే పరమావధిగా.. ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీకి శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని ఛాంబర్స్‌కి రోల్ మోడల్‌గా జిల్లా ఛాంబర్‌ని తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.

వాసవీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టీఎల్వీ వీరాంజనేయులు అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మిట్టపల్లి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ మిట్టపల్లి సత్యనారాయణ ఇతర వ్యాపార ప్రముఖులతో కలిసి టీఎల్వీ దంపతులను ఘనంగా సత్కరించారు. వీరాంజనేయులును ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వర్తక, వాణిజ్య రంగాల్లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ పాత్ర అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. ఏర్పడిన తొలి నాళ్ళ నుంచి గుంటూరు ఛాంబర్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానమున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యాపారస్తులకు ఎలాంటి సమస్య తలెత్తినా ముందుండి దాన్ని చక్కదిద్దడంలో ఛాంబర్ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వచ్చిందని ఆయన వివరించారు. అంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడుగా టీఎల్వీ వీరాంజనేయులు ఎన్నికవడం అత్యంత సముచితమని ఆయన అభిప్రాయపడ్డారు.

"తింటే గారెలే తినాలి.. వింటే రామాయణమే వినాలి.. పుడితే ఆర్యవైశ్య కులంలోనే పుట్టాలి" అన్న ఆర్యోక్తికి అనుగుణంగా సేవా గుణం, సామాజిక స్పృహ, వర్గ చైతన్యం మెండుగా గల టీఎల్వీ సారథ్యంలో జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరింత మెరుగైన పనితీరుతో కొత్త చరిత్ర సృష్టిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. దీన్ని తొలి అడుగుగా చేసుకుని మరింత అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆయన అభిలషించారు. వ్యాపారస్తులందరి తలలో నాలుకలా వ్యవహరించాలని.. వారి ఆశలు-ఆకాంక్షలకు అనుగుణంగా.. వారి ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా.. పనిచేస్తూ అందరి ఆదరాభిమానాలను చూరగొనాలని ఆయన సూచించారు. ఆ ప్రయత్నంలో పూర్తి సహాయ సహకారాలు అందించేందు మీ కుటుంబంలో ఒక సభ్యుడిగా.. అప్పిరెడ్డి గుప్తాలా.. తాను అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టంగా ప్రకటించారు.

మిట్టపల్లి ఇంజనీరింగ్ కాలేజ్ సెక్రటరీ మిట్టపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, అందరి హితుడు తన స్నేహితుడు అయిన టీఎల్వీ వీరాంజనేయులు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా ఎంపికవడం పట్ల సంపూర్ణ హర్షం వ్యక్తం చేశారు. టీఎల్వీ వీరాంజనేయులు మాట్లాడుతూ, తాను అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పెద్దల సూచనలు సలహాలను స్వీకరిస్తూ వారి ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వాసవీ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుల మురళి, గోవింద రాజేష్, కోశాధికారి అచ్యుత నాగేందర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు పబ్బిశెట్టి చిరంజీవి, ఈసీ మెంబర్లు కొప్పురావూరి శ్రీనివాస్, ఎల్ఐసి రవి, గీతా మందిరం చైర్మన్ రత్నప్రసాద్, వ్యాపార ప్రముఖులు షరాబు కృష్ణమూర్తి, తాడికొండ శ్రీనివాస్, అచ్యుత శ్రీనివాస్, దువ్వాడ అమర్‌నాథ్, కోట కిరణ్, మారుతి, పద్మనాభుని ఈశ్వరరావు, మొగిలి సతీష్, మైలవరపు ప్రవీణ్, కొత్తా కొండలు, అచ్యుత నిరంజన్, టీఎల్వీ శ్రీదేవి, టీఎల్వీ పవన్, గూండా సాంబ, మద్దాళి సుధాకర్, ఆకుల వసుంధర, తాడికొండ అంజని, గోవిందు అనిత తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు నగర అందాలకు సరికొత్త ఆకర్షణ




○ **8 ప్రాంతాల్లో 'ఐ లవ్ గుంటూరు', 'మన గుంటూరు' బోర్డులు**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర సుందరీకరణలో భాగంగా నగరంలోని 8 ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో 'ఐ లవ్ గుంటూరు', 'మన గుంటూరు' పేరుతో ప్రత్యేక స్వాగత, ఆహ్వాన బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. నగర రూపురేఖలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజల్లో గుంటూరు నగరంపై ప్రేమ, గర్వభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

నగర ప్రవేశ మార్గాలు, ప్రధాన జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఈ బోర్డులు సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించడంతో పాటు గుంటూరుకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. తొలి దశలో గాంధీ పార్క్ ప్రధాన గేట్ వద్ద బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పొన్నూరు రోడ్డు నుంచి నగర ప్రవేశ మార్గంలో గుంటూరు మిర్చి ప్రత్యేకతను చాటిచెప్పేలా 'గుంటూరు -- చిల్లీస్ సిటీ ఆఫ్ ఇండియా' పేరుతో మరో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆటోనగర్ వై-జంక్షన్, నంది వెలుగు ఆర్ఓబీ వద్ద మానస సరోవరం పార్క్, గుజ్జనగుండ్ల జంక్షన్, అమరావతి రోడ్డు, కోరిటెపాడు పార్క్ జంక్షన్‌తో పాటు ఇతర ప్రధాన నగర ప్రవేశ మార్గాల్లోనూ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో ఆకట్టుకునే లైటింగ్, వినూత్న డిజైన్లతో వీటిని తీర్చిదిద్దనున్నామని, ఇవి పర్యాటకులు, స్థానికులకు ప్రత్యేక సెల్ఫీ పాయింట్లుగా మారనున్నాయని పేర్కొన్నారు. నగర సుందరీకరణలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి, బోర్డుల సంరక్షణలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

○ **పని ఒత్తిడి, టార్గెట్లతో వేధింపులకు అడ్డుకట్ట వేయాలి: సీఐటీయూ**

○ **నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాలని, తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు నిర్వహిస్తున్న పోరాటాలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివిధ సేవలు అందిస్తున్నారని సీఐటీయూ పేర్కొంది. వివిధ శాఖలు విధించే టార్గెట్లు, సర్వేల భారం, ఎస్ఐఆర్ పేరుతో ఒత్తిడి కారణంగా ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపింది. అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులను సైతం విధులకు హాజరు కావాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలను నిలిపివేసి, ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది. పని ఒత్తిడితో మరణించిన సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేసింది.

సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాలని, నిర్దిష్ట ప్రమోషనల్ చానల్ కల్పించాలని సీఐటీయూ కోరింది. ఉద్యోగులకు నష్టదాయకంగా ఉన్న జీఓ నెం. 11ను రద్దు చేయాలని, సర్వేల భారాన్ని తగ్గించాలని, గతంలో జారీ చేసిన జీఓఎంఎస్ నెం. 5 ప్రకారం రేషనలైజేషన్ ప్రక్రియను పునఃసమీక్షించాలని డిమాండ్ చేసింది. ప్రొబేషన్ ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన ఎరియర్స్‌ను చెల్లించాలని కోరింది. ఈ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు చేపడుతున్న పోరాటాలకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

## తోట సుధాకర ప్రసాద్ ఆశయాలు కొనసాగిస్తాం



○ **ఉద్యోగుల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం స్ఫూర్తిదాయకం**

○ **ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు**

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తోట సుధాకర ప్రసాద్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. తోట సుధాకర ప్రసాద్ 25వ వర్ధంతిని పురస్కరించుకుని విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని రెవెన్యూ భవన్ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని బొప్పరాజు ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యల కోసం ఉద్యమిస్తూ ప్రాణాలు కోల్పోయిన ఆయన త్యాగం స్ఫూర్తిదాయకమని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

తోట సుధాకర ప్రసాద్ ఆశయాల స్ఫూర్తితోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగిస్తున్నామని బొప్పరాజు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై గతంలో చేపట్టిన ఉద్యమాలతో పాటు 2023 మార్చి 9 నుంచి మే 8 వరకు 92 రోజుల ఉద్యమం ద్వారా పలు సమస్యలను పరిష్కరించుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఐదు రోజుల ఉద్యమంతో రెండు డీఏలు, సరెండర్ లీవులు, పెన్షనర్ల అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్, సచివాలయ ఉద్యోగుల ఇంక్రిమెంట్, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తదితర అంశాల్లో పరిష్కారాలు సాధించామని చెప్పారు. భవిష్యత్‌లోనూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని, అవసరమైతే సుధాకర ప్రసాద్ బాటలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

రెవెన్యూ శాఖలో సుధాకర ప్రసాద్‌తో కలిసి పనిచేసిన సత్తి నాగేశ్వరరెడ్డి, ఆయనలాంటి నిస్వార్థ నాయకుడు అరుదని అన్నారు. ఆయన భార్య కామాక్షి సుధాకర ప్రసాద్ మాట్లాడుతూ తన భర్తకు ఉద్యోగుల సమస్యలే ప్రపంచమని, ప్రస్తుతం ఆయన ఆశయాలను బొప్పరాజు వెంకటేశ్వర్లు కొనసాగించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి, డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి

○ **అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి**

○ **కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో ఘన విజయానికి కృషి చేయాలి**

○ **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**నిమ్మాడ, (జర్నలిస్ట్ ఫైల్):** నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన వినతులను స్వయంగా పరిశీలించిన మంత్రి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో మంత్రి సమావేశమై రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ సమష్టి కృషితో ఘన విజయాన్ని సాధించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని మంత్రి అన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి, ప్రతి కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయడం, పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను స్పష్టంగా వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమాచారం చేరేలా చూడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంచుకోవడం ద్వారా గ్రామస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

# రాజధాని రైతుల కోసం ధనేకుల రామారావు సేవలు చిరస్మరణీయం

○ **అమరావతి కోసం 50 ఎకరాల భూమి సమర్పించారు**

○ **రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడారు: నక్కా ఆనందబాబు**



**తుళ్లూరు(అమరావతి), (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని అమరావతి కోసం సుమారు 50 ఎకరాల భూమిని సమర్పించడంతో పాటు రైతుల హక్కుల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన ధనేకుల రామారావు సేవలు చిరస్మరణీయమని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. నేలపాడు గ్రామానికి చెందిన రాజధాని రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి, అమరావతి జేఏసీ సభ్యుడు ధనేకుల రామారావు సంస్మరణ సభను తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు ధనేకుల రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ధనేకుల రామారావు తన జీవితాన్ని రైతుల కోసం, అమరావతి రాజధాని కోసం అంకితం చేశారని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్‌పై రైతులకు అవగాహన లేని సమయంలో నేలపాడు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించి, భూ సమీకరణలో ఇతర రైతులను భాగస్వాములను చేయడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. రాజధాని రైతుల సమస్యలు, వారి హక్కులు, ప్లాట్లు, గ్రామకంఠాలు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని చెప్పారు.

అమరావతి రాజధాని పరిరక్షణ కోసం ఏర్పడిన జేఏసీలో ధనేకుల రామారావు కీలకంగా పనిచేశారని నక్కా ఆనందబాబు తెలిపారు. రాజధాని ఉద్యమం, రైతుల పాదయాత్రలు, న్యాయపోరాటాలు, ఇతర ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని, ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొని సుమారు 40 రోజుల పాటు జైలు నిర్బంధాన్ని కూడా అనుభవించారని గుర్తుచేశారు. రాజధాని రైతు పరిరక్షణ సమితి కార్యదర్శిగా రైతుల సమస్యలను ప్రభుత్వం, న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ముందుండేవారని పేర్కొన్నారు.

అమరావతి కోసం భూమి ఇచ్చిన రైతుగా మాత్రమే కాకుండా, రైతుల హక్కుల కోసం గొంతుకగా నిలిచిన వ్యక్తిగా ధనేకుల రామారావును గుర్తుంచుకోవాలని నక్కా ఆనందబాబు అన్నారు. ఆయన సేవలు, త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు, అమరావతి రైతు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అమరావతి జేఏసీ నాయకులు, రాజధాని రైతులు, రైతు మహిళలు, దళిత రైతులు, నేలపాడు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొని ధనేకుల రామారావుకు ఘన నివాళులర్పించారు.

# ఓటు చోరీ ఆరోపణలు నిరాధారం

○ **ఎస్ఐఆర్‌పై ఈసీ స్పష్టత ఇచ్చింది.. అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు**

○ **ప్రజల్లో బలం ఉంటే ఎన్నికల్లో పోటీ చేసి మద్దతు పొందాలి**

○ **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ఎన్ మాధవ్**




**విశాఖపట్నం, సెప్టెంబరు 27 (జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీపై ప్రతిపక్షాలు 'ఓటు చోరీ' పేరుతో నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ఎన్ మాధవ్ విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు.


ఎన్నికల సంఘం విడుదల చేసిన పూర్తి ప్రకటనను ప్రతి ఒక్కరూ చదవాలని మాధవ్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సెప్టెంబరు 26న ఎన్నికల సంఘం స్పష్టత ఇస్తూ, దేశవ్యాప్తంగా చేపట్టిన ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నట్లు పేర్కొంది. అలాగే ఎస్ఐఆర్‌లో నోటీసులు అందుకున్న వ్యక్తుల ఇళ్లకు బూత్ లెవల్ అధికారులు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని ప్రకటించింది.

ఓటర్ల జాబితా తయారీ, సవరణకు ఎన్నికల సంఘం వద్ద నిర్దిష్ట వ్యవస్థ ఉందని మాధవ్ తెలిపారు. సీఈఓ, ఈఆర్ఓ, డిప్యూటీ ఈఆర్ఓలతో పాటు బూత్ లెవల్ అధికారులు వివిధ దశల్లో పనిచేస్తారని చెప్పారు. ఫారాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, పరిశీలన వంటి ప్రక్రియల ద్వారా ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ సమయంలో అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తొలగిపోకుండా పలు రక్షణ చర్యలు ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ కూడా వివరించింది.

పెద్ద స్థాయిలో జరిగే ప్రక్రియలో పొరపాట్లు జరిగే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని మొత్తంగా 'ఓటు చోరీ'గా అభివర్ణించడం సరికాదని మాధవ్ అన్నారు. మరోవైపు ఎస్ఐఆర్ అమలుపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్న విషయం కూడా కొనసాగుతోంది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని అంశాలపై సుప్రీంకోర్టు ఇటీవల ఎన్నికల సంఘాన్ని వివరణ కోరినట్లు వార్తలు వెలువడ్డాయి.

రాహుల్ గాంధీతో పాటు సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను మాధవ్ ప్రస్తావిస్తూ, అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని కోరారు. ప్రతిపక్షాలకు నిజంగా ప్రజల్లో బలం ఉంటే తమ రాజకీయ విధానాలను ప్రజల ముందుంచి ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు పొందాలని సూచించారు. గతంలో కొన్ని రాష్ట్రాల్లో బీజేపీకి పరాజయాలు ఎదురైనా ప్రజల తీర్పును పార్టీ గౌరవిస్తుందని తెలిపారు. బీజేపీ బలానికి పార్టీ సంస్థాగత నిర్మాణం ప్రధాన కారణమని మాధవ్ పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు పార్టీ వ్యవస్థ పనిచేస్తోందని, కార్యకర్తలకు నిర్దిష్ట కార్యక్రమాలు అప్పగించి వాటి అమలును పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేసే ముందు సంబంధిత అధికారిక సమాచారం, ఎన్నికల సంఘం ప్రకటనలను పరిశీలించాలని ఆయన కోరారు.

## విజయవాడలో మిషన్ కర్మయోగిపై ప్రాంతీయ సదస్సు



○ **ఈ నెల 29, 30 తేదీల్లో దక్షిణాది రాష్ట్రాల రెండు రోజుల వర్క్‌షాప్**

○ **సదస్సుకు హాజరుకానున్న కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**

○ **29వ తేదీన సదస్సును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఉద్యోగుల్లో సామర్థ్య నిర్మాణం, పరిపాలనా నైపుణ్యాల పెంపు లక్ష్యంగా మిషన్ కర్మయోగిపై దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వర్క్‌షాప్ విజయవాడలో జరగనుంది. సాధనా శృంఖలా పేరిట ఈ నెల 29, 30 తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో రెండు రోజుల పాటు సదస్సును నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, సంబంధిత భాగస్వాములు ఇందులో పాల్గొననున్నారు. 29తేదీన జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించనున్నారు. ఈ సదస్సుకు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ కూడా హాజరుకానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, మిషన్ కర్మయోగి ప్రతినిధులు కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మిషన్ కర్మయోగిలో భాగంగా ప్రభుత్వ శిక్షణ సంస్థల కెపాసిటీ బిల్డింగ్, ఉద్యోగుల నైపుణ్యం పెంపు అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా సామర్థ్యాల పెంపు కోసం ఐగాట్, మిషన్ కర్మయోగి వేదిక వినియోగంపై ప్రదర్శన ఇవ్వనున్నారు. మిషన్ కర్మయోగి క్వాలిటీ ఫ్రేమ్‌వర్క్, కర్మయోగి కర్తవ్య కార్యక్రమం కింద వివిధ శిక్షణా సంస్థల పాలనకు సంబంధించిన ముసాయిదా ఫ్రేమ్ ఈ సదస్సులో చర్చ జరగనుంది. అంతర్రాష్ట్ర బృందాల కార్యకలాపాలు, ప్రశ్నోత్తరాల ద్వారా వివిధ రాష్ట్రాల అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకోనున్నారు.

**రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజెంటేషన్లు**

ఈనెల 29న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉదయం 10:30 గంటలకు సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. అనంతరం వివిధ అంశాలపై సాంకేతిక సమావేశాలు జరుగుతాయి. సెప్టెంబర్ 30న నిపుణుల సమావేశం, రాష్ట్రాల ప్రదర్శనలు, బృంద చర్చలతో వర్క్‌షాప్ ముగియనుంది. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా కాకుండా, ఆయా శాఖల పనితీరును మెరుగు పరిచే భాగస్వాములుగా ఎదగాలన్నది ఈ వర్క్‌షాప్ ప్రధాన సందేశం. దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకునేందుకు, ప్రజలకు అందే సేవల నాణ్యతను పెంచే శిక్షణ పద్ధతులపై కలిసి పనిచేసేందుకు విజయవాడ వేదిక కానుంది. పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వివిధ రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాలను పరస్పరం మార్చుకునేందుకు ఈ కార్యశాల కీలకంగా మారనుంది.

## ఘనంగా డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ జన్మదిన వేడుకలు



○ **ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ జన్మదిన వేడుకలను తెనాలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా నుంచి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఫోన్‌లో డాక్టర్ కత్తెర సురేష్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దుస్, కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు, శాఖమూరి నారాయణ ప్రసాద్, వసంతం అశోక వర్ధన, కేసన కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రిమూర్తి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర, రావి చిన్ని, కోగంటి రోహిత్, మల్లవరపు విజయ్, సుద్దపల్లి నాగరాజు, పరుచూరి రమ్య, కొండా రమాదేవి, బోయపాటి అరుణ, గుమ్మడి భావన, వాణి, కామేశ్వరి, పినపాటి రవీంద్ర, అన్నం పిన్నారావు, బ్రహ్మేశ్వరరావు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం వర్సిటీ ఆరుష్ - 2026కు భారీ స్పందన

○ **ఆకట్టుకున్న సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శనలు**

○ **లక్ష మందికి పైగా సందర్శకులు హాజరు**

○ **గ్లోబల్ టెక్నాలజీ వేదికగా నిలిచిన ఎస్ఆర్ఎం వర్సిటీ**



**చెన్నై:** సాంకేతికత, ఆవిష్కరణలు, ఔత్సాహికత, మేనేజ్‌మెంట్ రంగాల్లో యువ ప్రతిభకు వేదికగా నిలిచిన ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగిన 'టెక్నో మేనేజ్మెంట్ ఫెస్ట్ ఆరుష్ 2026' కు భారీ స్పందన లభించింది. నాలుగు రోజులు పాటు జరిగిన ఈ సాంకేతిక వైజ్ఞానిక ఫెస్ట్ కు లక్ష మందికి పైగా సందర్శకులు హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం ప్రదర్శనలు ఘనంగా ముగిసాయి. ప్రదర్శనలు ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం జరిగింది.

దేశవ్యాప్తంగా 148 కళాశాలలకు చెందిన 12,974 మంది విద్యార్థులు పాల్గొనగా, 107 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరై ఆరూష్‌ను విజయవంతం చేశారు.

'టువార్డ్స్ ఇన్ఫినిటీ' అనే స్ఫూర్తిదాయక ఇతివృత్తంతో నిర్వహించిన ఆరూష్ '26లో భవిష్యత్ సాంకేతికతకు సంబంధించిన అనేక ఆవిష్కరణలను ప్రదర్శించారు. రోబోటిక్స్, డ్రోన్లు, స్వయంప్రతిపత్తి వ్యవస్థలు, రక్షణ సాంకేతికత, ఇమ్మర్సివ్ టెక్నాలజీ, ఇంటెలిజెంట్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాల్లో విద్యార్థులు, పరిశోధకులు తమ ప్రతిభను చాటుకున్నారు.

టెక్నాలజీ షోకేస్ ఈ వేడుకకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. లైవ్ ఎఫ్‌పీవీ డ్రోన్ ప్రదర్శనలు, వైమానిక సాంకేతికత, అన్వేషణ సాంకేతికతలకు సంబంధించిన ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతికతను పరిచయం చేస్తూ డీఆర్‌డీవో ఆధ్వర్యంలో బి.ఎం.పి -2 ట్యాంకర్, ఇంటర్ ఆక్టివ్ రోబోటిక్స్ వంటి ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా కట్టుకున్నాయి.

ఎస్ఆర్ఎం ఐఎస్టీ విద్యార్థి బృందాలు కూడా తమ సృజనాత్మకతను ఘనంగా ప్రదర్శించాయి. టీమ్ రుద్ర , టీమ్ ఎన్విజన్ రూపొందించిన కస్టమ్ డ్రోన్లు, ఎఫ్‌పీవీ సిస్టమ్స్, రాకెట్లు, రోబోటిక్స్, ఇమ్మర్సివ్ టెక్నాలజీ ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. క్వాడ్‌కాప్టర్, రోబోలీగ్ వంటి ఈవెంట్లలో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మక ఆలోచనా విధానం ప్రతిబింబించాయి.

అటానమస్ మొబైల్ రోబోట్స్, స్వయం సమతుల్యతను సాధించే ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్లాట్‌ఫామ్‌లు, ఐఓటీ ఆధారిత క్యాబీ రోబోట్ వంటి వినూత్న ప్రాజెక్టులు ఆటోమేషన్, ఇంటెలిజెంట్ మొబిలిటీ, విద్యా రంగాల్లో భవిష్యత్ సాంకేతిక అనువర్తనాలను చాటిచెప్పాయి.

దేశ, విదేశాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, వక్తలు, అతిథుల భాగస్వామ్యంతో ఆరూష్ '26 అంతర్జాతీయ పరిధిని మరింత విస్తరించుకుంది.

విద్యార్థుల ఆలోచనలకు, ఆవిష్కరణలకు కేంద్రస్థానం కల్పిస్తూ భారతదేశ సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో యువ ప్రతిభను ప్రపంచ వేదికతో అనుసంధానించే కీలక వేదికగా ఆరూష్ '26 తన 20వ ఎడిషన్‌లో సరికొత్త మైలురాయిని నెలకొల్పింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467